మహాత్మా! మహర్షీ!
సర్వజీవులలో వసించే
వాసుదేవతత్వానికి
సగుణరూపంగా సాక్షాత్కరించిన
శ్రీసాయిని మీ ఆయువుగా,
ప్రాణవాయువుగా నిలుపుకున్నారు..
మీ ఆశ, ఆశయం, ఆకాంక్ష ఎంత ప్రబలంగా
ప్రకృతిలో లయించాయో కదా!
పల్లెపదాల్లో, పట్టణ ప్రాకారాల్లో, ఖండ, ఖండాంతరాలలో,
సాయినామం పలుకుతోంది...
ఇలవేల్పుగా శ్రీసాయిరూపం మా మదిలో రంజిల్లుతోంది...
ముప్పిరిగొంటున్న శ్రీసాయిమహిమ మాతృత్వ మధురిమగా
మనోల్లతలను పూయిస్తోంది..
'సాయిబాబా' అని ఆర్తిగా పిలిచే ప్రతీసారి సాయిపదరవళులు
మమ్ము ఆనందసంద్రంలో ఓలలాడిస్తున్నాయి..
మీ మాటలే కదా శాశ్వతం... మీ బాటలే కదా పూర్ణత్వం...
చూస్తున్నది మీ మోము అనుకున్నాం!
దర్శనమిస్తోంది మాత్రం శ్రీసాయి నగుమోము దేవా!
పట్టుకున్నది మీ పాదాలే!
అనుభూతి చెందుతోంది మాత్రం శ్రీసాయి చరణకమలాలే!

www gurukrupa.info | +91 83672 00045



## దిగివచ్చిన దివ్యత్వం

# గురుకృప

విజయదశమి సంచిక



## బాబా ఎవరు? బాబా అంటే ఏమిటి?
## ఆయనను మనం ఎలా అర్థం చేసుకోగలం?

ఆయన కంటికి రెప్పలా సదా మనలను రక్షిస్తుంటారు. కావలివానిలా ఎల్లవేళలా మనలను కనిపెట్టుకుని ఉంటారు. మనమెప్పుడు మన వ్యక్తిత్వ పరిమితుల నుండి బయటపడి ఆయన ఇవ్వదలుచుకున్న దానిని ఎప్పుడు అడుగుతామా అని ఎంతో ఆతురతతో ఎదురుచూస్తుంటారు. ఎప్పుడెప్పుడు వీళ్ళు నన్ను అడుగుతారా (ఆయన ఇవ్వదలుచుకొన్నది) అని ఆశతో నిరంతరం నిరీక్షిస్తారాయన. అదీ - సాయిబాబా అంటే! అంతులేని సహనశీలి. ఆయన మనలను సబూరి అడుగుతారు. మనమివ్వం కనుక ఆయనే మన పట్ల ఓర్పుతో ఉంటారు. అదీ సబూరి అంటే. మనమివ్వలేనప్పుడు ఆయనైనా ఇవ్వాలి కదా మరి. (గురువుగారు నవ్వుతూ...) ఆయన సబూరి ఇచ్చి "రండి, కనీసం ఒక్క వాసననైనా వదిలిపెట్టండి" అని మరలా పుచ్చుకుంటారు. ఆయన ఎంతో సహనం, పట్టుదల కలవారు. మనమేం చేసినా సహనం, పట్టుదలతో వేచిచూస్తుంటారు. అనుకున్నది సాధిస్తారాయన. అదే సాయిబాబా.

– శ్రీబాబూజీ



## 'తండ్రికి తగ్గ బిడ్డలుకండి' అంటే ఎట్లా సార్?

బాబా మనకు తండ్రి అనుకున్నట్లయితే, ఆయన ఏ స్థితికి పోయున్నారో,
ఆ స్థితికి తగ్గటువంటి వారసులం మనం కావాలి.
దాంట్లో మిస్టరీ ఏముందయ్యా అర్థం కాకపోవడానికి?
ఆ స్థితికి చేరడానికి ప్రయత్నం చేయాలి మనం. ప్రయత్నం చేయాలి.
వీళ్ళా సాయిభక్తులు అనేరకంగా చేయకుండానైనా ఉండాలి కనీసం.
ఆయన స్థితికి చేరాము, చేరకపోయాము వేరే విషయం.
సాయిభక్తులు అంటే - సాయి బిడ్డలు అని అర్థం.
వీళ్ళా సాయిభక్తులంటే? ఆయనేంది ఇట్లా ఉన్నాడు?
వీళ్ళేంటి ఇట్లా ఉన్నారే? అని అనిపించుకోకుండా
ఉంటే చాలు, కొంచెం ఫస్ట్ స్టెప్.

– శ్రీబాబూజీ




వెదజల్లుతుంటాయి. పరమాచార్య స్వామివారి జీవితమంతా వారి దివ్యత్వవైభవం – ఆశ్రితులను కాపాడటానికి, ధర్మమార్గంలో నడిపించడానికి వ్యక్తమౌతూనే ఉంది. ఆ లీలా సౌరభాన్ని ఆస్వాదించి, 'తాను శ్రేయోదాయకమని నమ్మిన దాన్ని నలుగురికి పంచిన' ఎందరో గురుబంధువుల మిషగా స్వామివారి పదాశ్రయులయ్యారు మరెందరో. తరాలు చక్కగా రూపుదిద్దుకుంటున్నాయి. ఈనాటికీ ఈ చరిత్రను పంచుకుంటున్న నేను కూడా వారి భక్తుల అనుభవాలు వింటూ పరవశిస్తున్నానంటే, **మహాత్ములు దేహానికి పరిమితం కారని, అవని ఉన్నంత వరకు, ఆశ్రితులను గమ్యం చేర్చే వరకు ఆ జగద్గురుచంద్రులు చేయిపట్టి నడిపిస్తుంటారనేది అనుభవైకవేద్యం. సర్వజ్ఞులై, సర్వవ్యాపకులై, సర్వసమర్థులై విలసిల్లే ఆ సద్గురుతత్త్వానికి సర్వస్య శరణాగతి చెందడం మానవ జీవన అవసరం. మానవాళికి మాత్రమే అందిన గొప్పవరం. సద్గురు చరణం శరణం.**

– గురుకృప



**గురు'బంధు'వుకు సప్రేమ నివాళి**



"ఈ ఇలలో భగవంతుడు మానవరూపం దాల్చి అవతరించినపుడు, ఇతర దేవీ దేవతలూ, యోగులూ, జీవన్ముక్తులూ ఆయనతోపాటు వస్తారు. వారి పాత్రా, లక్ష్యమూ ఏమిటో గ్రహించి ప్రతి ఒక్కరూ ఆ దివ్య నాటకంలో పాత్రోచితంగా నటిస్తారు". ఎన్ని జన్మల ప్రేమ సంబంధమో, పూజ్య గురుదేవులు శ్రీబాబూజీకి మేనమామగా, వారి సోదరి సుచిత్రాదేవిగారి భర్తగా-బావగారిగా దశాబ్దాల కాలం శ్రీబాబూజీకి ఎంతో ఆత్మీయంగా మెలిగిన గురు'బంధువు' **శ్రీవి.టి.రావుగారు.** వారిద్దరి అనుబంధాన్ని గురించి ప్రత్యేకంగా మరోసారి పంచుకోవాల్సిందే! వయసులో చిన్నవారైన 'శరత్' నుంచి 'శరత్‌బాబూజీ'గా విలసిల్లిన ఆ సద్గురు చరణాలకు నిత్యకైమోడ్పులర్పించిన **శ్రీవి.టి.రావుగారు,** సెప్టెంబరు 27వ తేదీ 2025న నటరాజుని పంచక్షేత్రాలలో ఒకటైన, పవిత్ర కుర్తాళేశ్వర క్షేత్రమైన తెన్‌కాశీలో సద్గురుచరణాలలో ఐక్యమయ్యారు. **"With Love - Sarat"** అని తన ప్రేమ సంతకంతో ఇచ్చిన శ్రీసాయిసచ్చరిత్రను నిత్యం పారాయణ చేసుకుంటూ, క్రమం తప్పకుండా ఎక్కడున్నా నిత్యం గురువుగారి చెంత 'దీపం' వెలిగించుకుంటూ, సదా గురుస్మరణలో గడిపిన మృదుస్వభావి **రావుగారు**. భగవంతుని చేతనే 'మామ' అంటూ ఆప్యాయంగా పిలిపించుకున్న ఆ భాగ్యశాలికి **'గురుకృప'** సవినయంగా అంజలి ఘటిస్తోంది... నమస్సులర్పిస్తోంది...



సంపుటి : 28
సంచిక : 4

విజయదశమి సంచిక
2 అక్టోబర్ 2025






గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. – శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



4 పథగామి – గురుకృప
10 అందరం కలిసి సాయిపథంలో ఉద్యమిద్దాం... – గురుకృప
13 సత్సంగభాషణలు – శ్రీబాబూజీ
18 ప్రాణశక్తికి పలకరింపు – హోమియో విధానము – అవగాహన నుండి
21 నామస్మరణ మహత్యం – గురుకృప
23 గురుకృపాలహరి – గురుకృప

నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు*

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



## పథగామి

**"జీవించాలి బతకడం కాదు"** అంటారు శ్రీబాబూజీ.....ఈ జీవితాన్ని బాబా ఇచ్చినది.. జీవించడానికే. జీవించడమే గొప్ప సాధన. సరిగ్గా జీవిస్తే మానవత్వం వెల్లివిరుస్తుంది. మంచిగా జీవిస్తే దివ్యత్వం ప్రసరిస్తుంది.

అట్టి ఈ జీవన ప్రయాణంలో చింకిగుడ్డల కోసమా మన సాధన!!

నేను భగవంతుని (ప) వరంగా ఉండాలి! నేను ఆధ్యాత్మికంగా ఎదగాలి! నాతో(లో) వున్న దైవాన్ని నేను చూడాలి! దైవం ఎప్పుడూ నన్నూ, నా కుటుంబాన్ని కాపాడుతుండాలి!

నేను చేసే ప్రతి పనికీ దేవుడు సహకరిస్తుండాలి! నాకు ఏ కష్టమూ రాకుండా దేవుడు చూసుకోవాలి!

ఇలా నిత్యమూ ప్రార్థించే వ్యక్తులు మనలో ఎంతమందిమి! ఇందులో మనమూ ఉన్నామేమో! ఇట్టివారు భగవంతుని దర్శనానికి, భగవత్ ప్రాప్తికి తపిస్తున్నారంటే అందులో ఆశ్చర్యమేమీ ఉండదు. ఈ వ్యక్తులు భగవత్ సాక్షాత్కారానికి అన్వేషణ సాగిస్తూనే ఉంటారు. తారసిల్లిన స్వామీజీలను, సన్యాసులను, పీఠాధిపతులను అడుగుతూనే ఉంటారు. భగవంతుణ్ణి పొందే మార్గం తెలుపమని, అందుకోసంగా జపతపాలు, యజ్ఞయాగాలు, అష్టాంగయోగాలు.. ఇలా రకరకాల సాధనలను సాగిస్తారు.

ఏ మహాయోగి అయినా, ఏ మహాత్ముడైనా ఎదురుపడి, "రేపు రాత్రికి భగవంతుడు వచ్చి, నీ ఇంటి తలుపు తడతాడు. నిన్ను తన వానిగా చేసుకుంటాడు. నీ చేయి పట్టుకొని తనతో నిన్ను తీసుకెళ్ళిపోతాడు, నీకున్న సమస్తమూ వదిలేసి దైవంతో అడుగులు వేయి" అని చెప్పారే అనుకోండి... అప్పుడు మొదలవుతుంది అసలు కథ–ఇప్పటివరకూ అనుబంధాన్ని పెంచుకున్న ఈ ప్రపంచాన్ని, ఎంతో ప్రేమానురాగాలు పంచే భార్యా బిడ్డలను, ఆప్యాయతలు కురిపించే బంధుమిత్రులను, ప్రతి అవసరానికి తోడ్పడే డబ్బును, ఎండవానల నుండి రక్షించే ఇంటినీ.. ఇలా ప్రతి క్షణమూ తోడున్న సమస్తాన్నీ వదిలేసి భగవంతునితో వెళ్ళిపోవడమంటేనే ఏదో దిగులు ఆవరించేస్తుంది మనిషికి, తెలియని భయం–భూతంలా పెనవేసుకుంటున్నది. అంటే ఇప్పటివరకూ తాను భగవంతుని గురించి పలికిన పలుకులు, తలచిన తలపులు, చెప్పుకున్న ఊసులు, ఆయన గురించి వినగానే కలిగే పారవశ్యాలు, కునుకు తీస్తూ కనులు మూసుకుంటే కానవచ్చే విచిత్ర దృశ్యాలూ.. ఇవన్నీ బూటకమేనా? అవును బూటకమనే అంటున్నాడు – ఎవరికివారిలో సాక్షిగా ప్రకాశిస్తున్న ఆ భగవంతుడు!





చెన్నైలోని నంగనల్లూరులో ముప్పైరెండు అడుగుల ఏకశిల హనుమ విగ్రహప్రతిష్ఠకై, దేవాలయానికై సంకల్పం జరిగింది, శ్రీరమణి అనే స్వామివారి అనుంగు భక్తుని ప్రేమతో. చాలా వ్యయప్రయాసలతో ఏకశిలా విగ్రహం తయారయింది. నంగనల్లూరు ఆలయం చేరింది. ఇక రాబోయే ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎలా చేయాలో స్వామివారిని అడగడం కోసం స్వామి చరణం చేరాడు శ్రీరమణి. సహజంగానే అనన్యభక్తికి ఆచార్యుడైన హనుమంటే స్వామికి ప్రీతి. అణువణువూ అడిగి చెప్పించుకుంటున్నారు స్వామివారు విగ్రహం గురించి. చివరగా స్వామివారితోక గురించి చెబుతూ "హనుమవాలము గుండ్రని ఆకృతితో తలపై నుండి ప్రక్కలకు ఉంటుంది పెరియవ" అన్నాడు శ్రీరమణి. స్వామివారు మౌనంగా ఉండిపోయారు. "స్వామివారి మూర్తి ఎదురుగా శ్రీరాముల వారిని కూడా ప్రతిష్ఠ చెయ్యదలచుకున్నానని చెప్పావు. కానీ రాములవారి ముందు హనుమ ఎప్పుడూ అలా తోక ఎత్తుకుని ఉండడు కదా!" అన్నారు పరమాచార్యస్వామి. ఆందోళనతో "పెరియవా! ఇప్పుడెలా? తోకను మారిస్తే మరలా అన్ని క్రతువులు చెయ్యాలి కదా!" అని వాపోయాడు శ్రీరమణి. "నిర్ణయించిన తేదీల ప్రకారం మీరు ముందుకెళ్ళండి. అంతా సర్దుకుంటుంది. హనుమే మనలను కాపాడుతారు" అని దీవించి పంపారు.

శ్రీరమణి కించమాత్రం అలా కొనసాగుతూనే ఉంది. ప్రతిష్ఠ కార్యక్రమాలన్నీ పూర్తిచేసి ముహూర్త సమయానికి హనుమను పీఠం చేర్చడానికి క్రేన్ సాయం తీసుకున్నారు భక్తులు. అక్కడున్న అందరికీ ఆశ్చర్యం కలిగేలా హనుమతోక సరైన చోట తెగి ఉండటం, అది కూడా ఏ మచ్చా లేకుండా ఎవరో శిల్పి అందంగా తీర్చిదిద్దినట్లుండటం గమనించారు. **భక్తులందరి కన్నుల వెంట ఆనందభాష్పాల పన్నీరు – తెలిసి వచ్చింది అందరికీ అది – పెద్దస్వామివారి అనుగ్రహ సెలయేరు. స్వామివారి ప్రతీ పని 'ప్రేమ'నే వ్యక్తం చేస్తుంది కనుకనే అర్చావతారుడైన హనుమ – తన ప్రాణమైన శ్రీరాముని చెంత ఉండే తీరును సమగ్రంగా, రాముని దాసునిగా దర్శించగలగారు, "ప్రేమను వ్యక్తం చేసే ప్రతి పనీ పూజే" అంటారు మా గురుదేవులు శ్రీబాబూజీ. అలా తన బిడ్డలు ఎన్నటికీ తప్పు చేయకుండా మార్గం చూపిన ఆ మహితమూర్తి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.**

సద్గురు అనుగ్రహ లీలా వినోదంలో ప్రతి ఆశ్రితుని జీవితమూ ఒక చరిత్రే. రాబోయే తరాలకు మార్గం తెలిపే పాఠమే. ఇలా మహాత్ముల చరిత్రలలో లెక్కలేనన్ని ఆశీర్వచన నక్షత్రాలు, మిణుకుమిణుకుమంటూ ఆ సద్గురు'చంద్రుని' చుట్టూ పరవశాన్ని ప్రసరిస్తూ, వెలుగులు



మరీ శ్రేయస్సును చేకూర్చాలని తపిస్తారు. అంతటి ఔదార్యం వెనుకనున్న ఆ అవ్యాజ ప్రేమ సూత్రమేమిటో ఆ గురుహరునికే ఎరుక. హగరి అనే ప్రాంతంలో చాతుర్మాస్యం చేస్తున్న రోజుల్లో కొందరు ఆశ్రితులను హంపి వెళ్ళిరమ్మని ఆదేశించి వస్తూ హంపి జీర్ణోద్ధరణసంస్థకు చెందిన ఇద్దరు ప్రముఖుల్ని పిలుచుకురమ్మన్నారు. సంతోషంగా వచ్చిన ఆ ఇద్దరూ స్వామివారితో చాలా సేపు మాట్లాడటం, ఎన్నో ఆలోచనలు, వారి ప్రణాళికలు పంచుకోవడం జరిగింది. భిక్షా సమయం అయి స్వామివారు లోపలికి వెళ్ళడం, తిరిగి వచ్చే సమయానికి వారిరువురూ అక్కడ లేకపోవడం జరిగిపోయాయి. "కొద్దిదూరం వెళ్ళి వారు కనపడితే వెంట తీసుకుని రమ్మని" అంతేవాసిని పురమాయించారు కూడా. అక్కడ ఉన్నవారికి కూడా అలా ఎలా సెలవు తీసుకోకుండా వారు వెళ్ళిపోయారో అర్థం కాలేదు. తరువాత తెలిసింది ఏమంటే బళ్ళారి దాటుతుండగా వారి కారుకు ప్రమాదం జరిగిందని, అక్కడికక్కడే ఒకరు మృతి చెందగా, మరొకరు పెద్దగాయాలతో బయటపడ్డారని. **మనిషి శ్రేయస్సుకై మహాత్ముని మది ఎంతగా తపిస్తుందో కదా! అవ్యాజ కరుణా జలధి – సద్గురు హృది.**

కార్వేటి నగరంలో మకాం చేస్తున్నారు స్వామివారు. చెన్నై నుండి వచ్చి దర్శనం చేసుకుని ఆ రోజు సాయంత్రమే తిరిగి వెళ్తున్నారు ఒక కుటుంబం. స్వామివారి దర్శనాశీస్సుల అనంతరం వారి అనుజ్ఞకై వేచి చూస్తున్నారు బయల్దేరడానికి. బిల్వవృక్షం క్రింద కూర్చుని ఆశీస్సులను, ప్రసాదాన్ని ఇచ్చారు స్వామి. కారు దగ్గరకు వెళ్తుండగా, స్వామివారు చిటిక వేసిన శబ్దం విని తిరిగి వచ్చారు స్వామివారి చెంతకు. అక్కడే ఉన్న గ్రానైట్ రాళ్ళముక్కల గుట్టను చూపిస్తూ "వీటిని కొన్ని గోనె సంచిలో కట్టి ఇంటికి తీసుకుని వెళ్ళు" అని చెప్పారు. అందరూ అయోమయంగా చూశారు, విరిగిపోయిన గ్రానైట్ ముక్కలు ఎందుకు తీసుకువెళ్ళమంటున్నారో అర్థంకాక, స్వామివారిని అడిగే ధైర్యం లేక అలాగే చేశారు. పుత్తూరు దగ్గర రాళ్ళగుట్టలతో ఉన్న దారిలో నలుగురైదుగురు దొంగలు వీరిని అటకాయించి కారంతా వెతికి బాగా బరువుగా ఉన్న డబ్బు సంచి ఇదేనని భావించి, ఆ సంచి తీసేసుకుని, వీరిని మాట్లాడనివ్వకుండా బెదిరించి పంపేశారు. నగలు, ఇతర వస్తువులు కూడా ఏమీ ముట్టుకోలేదు. రెండు రోజుల తరువాత ఆ భక్తుడు స్వామివారి చెంత చేరి రక్షించినందుకు శరణన్నాడు. ఆ దొంగలకు తెలియదు కదా! **ఈ భక్తులను కాచే 'దొర' ఎవరో. గురువే 'దొర'యై, గురువే 'ప్రవరై' ధర నిలిచిన వారికి చింతలు 'దరి' చేరవు కదా!**





భగవంతుని పరిధిలోకి ఒక్కసారి చేరితే, ఆయనకు సంబంధించిన మనిషిగా ఒక్కసారి అయితే ఏమవుతుందో బాగా తెలుసు ప్రతి ఒక్కరికీ – గుర్తింపు కోల్పోయి మిగులుతామని. **"నేను"** పోయినప్పుడు రా అని వశిష్ఠుడు రామునితో అన్న మాటల పరమార్థం, ఇదే కదా!. గురువుగారి సన్నిధిలో జరిగిన ఓ సందర్భం గుర్తుకు వస్తుంది. గురుసన్నిధిలో వున్న గురుబంధువులతో గురువుగారు చిటిక వేస్తూ, "ఎవరికి కావాలో చెప్పండయ్యా! ముక్తి, మోక్షం ఇస్తాను" అంటే, ఎవరూ మాట్లాడలేదట. మరెంతో విషయ పరిజ్ఞానం కలిగిన మనం పైకి భగవంతుడి కోసం అన్వేషిస్తున్నట్లు, అందుకే గురువును చేరినట్లు, జీవితాన్ని గురువు సేవకే అంకితం చేసుకున్నట్లు... ఇలా రకరకాల మాటలతో, తన ప్రవర్తన ఋజుమార్గంలో ఉన్నట్లుగా తనకు తాను నమ్ముతూ, చూపరులను నమ్మించేలా మాటలాడుతూ, భగవత్ మత్తులో ఓలలాడుతున్నట్లు భ్రమిస్తూ, ఇతరులను భ్రమింపజేస్తూ గురువు ఎలా నడిపిస్తే అలా నడుచుకుంటున్నట్లు చెప్తూనే, మరో ప్రక్క తమ తమ ఇష్టాయిష్టాలకు అనుగుణంగానే నడుస్తున్నవారు మనలో ఎంతమంది కలరో ఎవరికివారికి ఎరుక! ఇలాంటి వారికి నిజానికి భగవంతుడు అక్కరలేదు. ఆయన ద్వారా పొందవలసిన లాభాల కోసమే **'భక్తి'** అనే ముసుగు తొడగటం జరుగుతున్నది. ఈ భక్తి అనే పేరుతోనే జపతపాలు, నుదుట విభూతి నామాలు, వేషధారణలు కూడా జరుగుతున్నవి. అందుకే బాబా, "మీ ఇష్టాలకు అనుగుణంగానే నడిపిస్తాను. మీ జీవితంలో సౌఖ్యం చిక్కాక – నన్ను అనుసరించి గమ్యం చేరుకుంటారు" అన్నారు. ఇంత చక్కగా, స్పష్టంగా చెప్పినా, ఎందుకు ఈ ముసుగులో తెలియదు.

ఈ కొద్దిపాటి జీవితకాలంలో పుట్టుకొచ్చే అల్ప కోరికలు సాకారం చేసుకునేందుకే మనకు భగవంతుడు కావాలి. కానీ నిజంగా ఆయన అక్కరలేదు. భగవంతుడే కావాలనుకుంటే–ఆయనకు దూరంగా జరిపే వాటిని కోరుకోముగా! జేబులో పెన్ను కనపడకపోయినా, పరీక్షల్లో ఉత్తీర్ణత పొందాలన్నా, ఉద్యోగం కావాలన్నా, మనం ఎప్పుడు వెళ్తే అప్పుడు మాత్రమే బస్సు, రైలు రావాలని, కూర్చునేందుకు సీటు దొరకాలన్నా, సినిమాకు టిక్కెట్లు దొరకాలన్నా, మనం అనుకున్న వివాహ సంబంధమే ఖాయమవ్వాలన్నా, అనుకున్న ఉద్యోగమే రావాలన్నా, రాజకీయ నాయకుడిగా గెలవాలన్నా, ఖర్చులకు డబ్బులు ఎవరి నుండైనా రావాలన్నా, జీవితం సుఖమయం కావాలన్నా, కించిత్తు కష్టం లేకుండా ఉండాలన్నా, వర్షానికి తడుస్తున్నప్పుడు ఆ వర్షం ఆగిపోవాలని, ఎండపడాలన్నా, చలిగాలి తగ్గాలన్నా.... ఇలా మనం ఎప్పుడు ఏది ఎలా కోరితే అలా జరగటానికి మాత్రమే మన పూజలూ, ప్రార్థనలూ, మన దీక్షలూ, మన పారాయణలూ, మన సాధనలూ కొనసాగుతున్నాయి. ఇలా గురువు తీర్చే ప్రతీ కోర్కెను




'అనుగ్రహంగా' భావిస్తూ ముందుకు సాగుతున్నాం. "నా భక్తులు కోరినవన్నీ ఇస్తాను, నేనివ్వదలిచింది వారడిగేంత వరకు" అన్న బాబా వాగ్దానంలో మొదటి మాటకే పరిమితమవుదామా? ఆయన ఇవ్వదలచిందేమిటని ఆలోచిద్దామా! నిజానికి అనుగ్రహం అంటే 'నిన్ను ఆయనవాడిగా గ్రహించడం' అంటారు ఓ మహాత్ముడు. అలా కాకుండా కోర్కెల చుట్టూనే మనసు సదా పరిభ్రమిస్తుంటే సాయి ఊసులో సాగేదెట్లా! వారివ్వదలచిన దానిపై ధ్యాస కలిగేదెట్లా!

కోర్కెల వలయంలో 'భగవంతుడు నాకు కావాలి' అన్న ఊసు ఉండదు. మన వాసనలు, సంస్కారాలకు తగ్గట్లుగా కోరుకున్న విధంగా జరిపించేంతవరకు మాత్రమే భగవంతుని అవసరం ఉన్నదిక్కడ! పోనీ ఆ అవసరాలు తీరిన తర్వాతగానీ, ఆ సుఖాలు పొందిన తర్వాతగానీ పూర్తిగా భగవంతుడినే ఆశ్రయిస్తున్నామా? అంటే, అదీ ఉండటం లేదు. ఇక్కడ చోల్కర్‌ని గుర్తు చేసుకోవాలి. ఎక్కువమంది విషయంలో కష్టాలు బాధలు అనుభవించేటప్పుడు అవి తొలగాలన్న లక్ష్యంతో భగవత్ ఆరాధన సాగుతుంటుందేగానీ, ఆయన కోసం మాత్రం కాదు! కుటుంబ, సామాజిక, ఆధ్యాత్మిక పరంగా ఈ బంధాలన్నీ మనకు ఇష్టం కాబట్టి, బంధాలకోసం కష్టాలు కూడా ఇష్టంగానే పడుతుంటాము. ఇది మనందరి జీవితాలలో అనుభవించినదే. అయితే నిజమైన సాధకులు, మహాత్ములు కూడా కష్టాలు ఇష్టంతోనే పడుతుంటారు. కానీ వారు భగవంతుని కోసం కష్టాలు పడుతుంటే, మనం మన ఇష్టాలను తీర్చుకునేందుకు కష్టాలు పడుతున్నాము.

ఒకసారి ఒక పడవలో కొందరు నర్మదానదిని దాటుతున్నారు. అందులో శ్రీరంగావధూత కూడా ఉన్నారు. సాఫీగా పడవ సాగిపోతున్నది, నదిలో ఉన్నట్లుండి హఠాత్తుగా గాలి స్తంభించి, పడవ మధ్యలో ఆగిపోయింది. తెడ్లు వేస్తున్నా పడవ ముందుకు కదలటం లేదు.. వెంటనే కొందరు శ్రీదత్తబావనీ (శ్రీరంగావధూత రచించిన దత్తస్తోత్రము) బిగ్గరగా గానం చేయడం ఆరంభించారు. కొంచెంసేపటికి గాలి వీచడం మొదలైంది. ఇదంతా గమనిస్తున్న శ్రీరంగావధూత ఇలా అన్నారు– "ఇలాంటి అత్యల్ప విషయాలకు కూడా దత్తబావనీని ఎందుకు ప్రయోగిస్తారు? లేత గడ్డి కోయటానికి పలుచని కొడవలి బదులు పెద్ద పట్టాకత్తి దూసినట్లుంటుంది. దత్తబావనీ ఉత్కృష్టమైన బ్రహ్మానందమును అనుభవించుటకు, భగవాన్ దత్తాత్రేయ కటాక్షము పొందుటకు ఉపయోగించవలసిన సాధనము!" శ్రీస్వామివారి మాటలతో 'దత్త బావనీ' పాడటం వెంటనే ఆపివేశారు. ఇదెలా ఉందంటే కోటి రూపాయల చెక్కుతో పొయ్యి వెలిగించుకుంటున్నట్లుగా ఉన్నది మనం చేసేది. మనం చేసే పారాయణలు, పూజలూ, స్తోత్రాలూ,





మరుసటి రోజు అందరినీ విస్మయపరుస్తూ ఆ పాప కోలుకుని మాట్లాడటం మొదలుపెట్టింది. మాట్లాడవద్దంటున్నా తల్లిని పిలిచి "ఆకుపచ్చ పావడాలో రాత్రి అంతా తన ప్రక్కనే ఉండి నన్ను చూసుకొన్న పాప ఎక్కడ ఉంద"ని అడిగింది. పాపకు ఏమైనా అయిందేమోనని కలవరపడుతున్నారు వైద్యులు. ఈ బంధువుకు మాత్రం అర్థమైంది – తల్లి కామాక్షి అనుగ్రహం, పరమాచార్యుల ఆశీర్వచనం ఆ పాపకు పునర్జన్మనిచ్చాయని. **తల్లి కామాక్షిని దర్శించారా? ఆ తల్లిదండ్రుల వేదనను గమనించారా? ఆ బిడ్డ భవిష్యత్తును శ్రేయోదాయకంగా అనుగ్రహించారా? బిడ్డ శ్రేయస్సుకై సృష్టిని శాసించారా? ఎలా అర్థం చేసుకోగలమీ అవ్యాజ కరుణావిలాసాన్ని, సప్రేమ విశేషాన్ని. అందుకే శ్రీకృష్ణమాచార్యస్వామి అన్నారు "మహాత్ముల చరిత్రలు అంటే భాగవతుల సచ్చరిత్రలు" అని.**

రెండు మూత్రపిండాలు చెడిపోయి, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ, ఖరీదైన వైద్యం కూడా కాపాడని స్థితిలో ఒకతను స్వామి చరణం చేరాడు. మామూలుగా అయితే ఇలాంటి వారిని ఎంతో దయతో పలకరించే స్వామి, అతని బాధనంతా విని ఎందుకో కాఠిన్యం వహించారు. "లెక్కలేనన్ని తప్పులు, అధార్మికమైన పనులు చేసి వాటి ప్రతిఫలం అనుభవించాల్సినపుడు ఇక్కడకు వస్తారు. చేసిన తప్పులు మాత్రం తెలుసుకోరు. అందుకు నేనేమి చేయగలను" అన్నారు. హఠాత్తుగా ఇలా అనడం విని అక్కడి వారికి ఏం అర్థం కాలేదు. కొంతసేపటికి స్వామివారే "ఇతని పూర్వీకులు ధర్మాచరణం కోసం, మంచి పనుల కోసం ఒక సంస్థను ఏర్పాటు చేసి, అందుకోసం ఆదాయం వచ్చే భూమిని వదిలి వెళ్ళారు. మంచినీటి బావుల కోసం, ధార్మికమైన పనులకోసం వారు ఆ పని చేస్తే ఇతను ఆ భూమినంతా అమ్మి ధనాన్ని దోచుకున్నాడు" అని అన్నారు. పశ్చాత్తాపంతో తప్పును ఒప్పుకుని "ఎన్నటికీ ఈ తప్పును చేయను. ధార్మిక కార్యక్రమాలకే ధన వినియోగం చేస్తాను, నన్ను మన్నించండి పెరియవ" అని వేడుకున్నాడు. కరుణాంతరంగులు కదా స్వామి. "వస తెలుసా నీకు? మూలికల దుకాణంలో తీసుకుని దాన్ని నూరి రోజూ కడుపు క్రింది భాగంలో పూయి" అని సెలవిచ్చారు. పదిరోజుల తరవాత మరలా స్వామివారిని దర్శించి "ఇప్పుడు ఏ బాధా లేదంటూ" సాష్టాంగపడ్డాడు. **వ్యాధికి మందిచ్చిన వైద్యులే కాదు – భూతభవిష్యత్‌వర్తమానాలను దర్శించి మానవాళి భవరోగాన్ని తన సంస్కరణాపథంతో రూపుదిద్దిన ఘనవైద్యులు కూడా వారు.**

గురువు చెంతకు కొన్ని క్షణాలు చేరడం కూడా ఎన్నో జన్మల పుణ్యఫలమే. ఒక్కోసారి పిలిచి



**అంశం – ద్రష్టగా సృష్టిలో జరుగుతున్న ప్రతి అంశాన్నీ వందలమైళ్ళ దూరాల్లో, కంటిచూపుతో దర్శించే అవకాశం లేని సందర్భాలలో ఈ సద్గురుచంద్రులు ఎలా దర్శిస్తున్నారు? వీరు ఈశ్వరకోటిలో ఒకరా! లేదా సాక్షాత్తూ ఈశ్వరులేనా? సరి! ఏమైనా వారే మనకు తల్లీ, తండ్రీ, గురువు, దైవం.**

ఒకనాడు కాలు విరిగిన ఒక పెద్దాయన శ్రీమఠం ప్రధానద్వారం దగ్గర కూర్చుని ఉన్నాడు. స్వామివారు లోనికి వెళ్ళే సమయంలో అతడిని గమనించి, దర్శనానికి వచ్చిన భక్తుడ్ని “నాకు ఒక పని చేసి పెడతావా?” అని అడిగిందే తడవుగా ఆ భక్తుడు ఆనందపరవశుడై ‘మీ ఆజ్ఞ’ అన్నాడు. “ఎనిమిది అణాలకు తమలపాకులు, వక్కలు తెచ్చి అక్కడ ద్వారం వద్ద కూర్చుని ఉన్న అతనికి ఇవ్వు” అని సెలవిచ్చారు. అంగట్లో తీసుకుని, “ఇదిగో తాతా తీసుకో” అంటూ ఆ పెద్దాయనకిస్తే అతని ఆనందానికి అవధులు లేవు. పరమానందంతో “నువ్వు మహరాజులా బ్రతుకు నాయనా! కలకాలం సుసంపన్నంగా పిల్లాపాపలతో జీవించు. ఈ ఆకు, వక్క లేక ఉదయం నుండి అల్లాడిపోతున్నాను. చూడు నేను ఎక్కడికీ కదలలేను, డబ్బూ లేదు” చల్లగా ఉండంటూ ఆశీర్వదించాడు.

**ఆకలి తెలియడం సరే! ఆశిస్తున్నదేమిటో కూడా స్వామివారికెలా తెలిసింది? అంతుపట్టని ప్రశ్న – అంతరంగమంతా నాకెరుక అన్నది వారి మౌనవ్యాఖ్యానం.**

స్వామివారి దర్శనానికై చెన్నై నుండి బయల్దేరారు ఒక కుటుంబం. మార్గమధ్యంలో ప్రయాణం చేస్తున్న బండికి పెద్ద ప్రమాదం అయింది. తల్లిదండ్రులు బయటపడ్డారు – చిన్న పాపకు మాత్రం తీవ్రగాయాలయ్యాయి. వెనుకకు వెళ్ళి చెన్నైలోని ఆసుపత్రి ఐ.సి.యులో ఉంచారు. జరిగిన విషయాన్ని ఫోన్‌లో కంచిలోని బంధువుకు చెప్పి స్వామివారి ఆశీస్సులకోసం వేడుకున్నారు వారు. స్వామివారు జరిగిందంతా విని ఒక ఆపిల్ పండును కొద్దిసేపు తడుముతూ పట్టుకుని ధ్యానమగ్నులై ఆ పండును వారి బంధువుకిచ్చి రాత్రికల్లా ఆ పండును పాపదగ్గరకు చేర్చమని చెప్పారు. అంతేకాక వెళ్ళేముందు తల్లి కామాక్షి దర్శనం చేసుకొమ్మని, అర్చన అయ్యాక గుడి మూసేసే అవకాశం ఉన్నందున త్వరగా వెళ్ళమని ఆదేశించారు. రెండే రెండు నిమిషాలు ఆకుపచ్చ పావడాలో కరుణను వర్షిస్తున్న కామాక్షిని దర్శించి, పాపను దీవించమని వేడి చెన్నైలోని ఆసుపత్రి చేరాడు ఆ బంధువు. అప్పటికే వైద్యులు కష్టమని చెప్పారని విని, మహాస్వామివారిచ్చిన ఆపిల్‌పండు పాప చెంత ఉంచమన్న ఆదేశాన్ని తెలియజేశాడు. ఆ పాప తలగడ క్రింద ఆ ఆపిల్‌ను పెట్టారు వారు. విశ్వాసం సన్నగిల్లిన సమయమది.





పాదుకాపూజలు తదితరాలన్నీ లౌకిక కోరికలు తీర్చుకోవడానికి ఉపయోగించుకోవడం చూస్తుంటే శ్రీసాయిబాబా మాటలు స్మరణకొస్తున్నాయి– “జరీ శాలువాను ఇవ్వాలనుకుంటుంటే చింకిగుడ్డలు కోరుతున్నా”మని. మరి సాయిబాబానే చెప్పారు కదా! “మొదట అందరూ కోరికలతోనే వస్తారు. తర్వాత జీవితంలో స్థాయి చిక్కాక సన్మార్గంలోకి వస్తారు” అని, మరి కోరికలు తప్పు కాదు గదా అనిపిస్తుంది. మరి కోరికలు తీరిన తర్వాత, ఏం చేస్తున్నాం? మొక్కు తీర్చుకోవడమో, కానుకలు సమర్పించడమో, ఇత్యాదులు చేస్తున్న మనం, గురుపథంలోకి అడుగువేయడానికి అవసరమైన ఒక నియమాన్ని పాటిస్తానని మొక్కుకుంటున్నామా? అప్పుడు మన కోరికలని కూడా ఆయన చెంతకు చేరువ కావడానికి ఉపయోగించుకుంటున్నట్లు కదా! మనం అనుగ్రహవంతులం. అప్పుడు వివేకవంతులం అవుతాం. ఇది కదా, **“అడగడం కూడా బాబా పట్ల మన ప్రేమను వ్యక్తం చేసుకునేందుకు మార్గం కావాలి”** అనే గురువుగారి మాటలలోని మధురత్వం. అలా “అడగడం నేర్పడం సాయిపథం”.. అన్న గురుదేవుల మాట నిజమవుతుంది. అప్పుడు సాధనలో జీవితం భాగం అవుతుంది. ఇది కదా మన గురువుగారు మన నుండి కోరుతున్నది.

సద్గురువు నీకొకసారి లభించాక, నీ బాధ్యత ఆయన స్వీకరించారు అని తెలిసాక నీకు కష్టాలెదురైనా ఆయన ఉన్నారనే భావన నీకు అభయాన్నిస్తుంది. అందువలన నీలోని తపన, నీవు పడే బాధ పూర్వం అనుభవంగా గాక నీ అనుభవంలో మార్పు వస్తుంది. నీ కోరికలు, సంతోషవిషాదానుభూతులలో మార్పు కన్పిస్తుంది. సద్గురువు యొక్క అభయం లభించేదాకా కోరికలు వాటికవే పెరుగుతూ నిన్ను అనంతంగా బాధిస్తాయి. ఆయన లభించిన తర్వాత నీ కోరికల స్వరూపమే మారిపోతుంది. నీకు కోరికలు ఉంటాయి కానీ అవి ఆయన ద్వారా తీరుతుంటాయి. ఒక దశను చేరుకున్న తరువాత, కోరికలన్నీ నీ ప్రేమను వ్యక్తీకరించేవిగా రూపుదిద్దుకుంటాయి. **– సద్గురువు, శరశ్చంద్రికలు**

ధన, మాన, ప్రాణరక్షణకు భగవంతుడిని అభ్యర్థించవచ్చు. ఇంకా ఇతర ఏవేని సమస్యల నుండి బయటపడటానికి కూడా భగవంతుడిని కోరవచ్చు. తప్పు లేదు. అయితే ప్రతి చిన్న అవసరానికి, అల్ప సుఖవాంఛలు తీర్చుకోవడానికి భగవంతుడిని ఉపయోగించుకోవడాన్నే తగదని ఇక్కడ చెప్పుకుంటున్నాము. “నేను ఏదో ఇవ్వాలనుకుంటుంటే, వీళ్ళు రైల్‌లో రిజర్వేషన్, బస్సులో కిటికీ పక్క సీట్ అడుగుతున్నారు” అన్నారు గురువుగారు.

ఒకసారి ఒక వ్యక్తి తాను పన్నెండు ఏండ్లపాటు కఠోరసాధన చేసి నీటిమీద నడవగలిగిన శక్తి



సంపాదించుకున్నానని, నదిని అవలీలగా దాటగలనని శ్రీరామకృష్ణులతో అంటాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు– 'అర్ధరూపాయి ఇస్తే పడవ నడిపేవారు పడవలో నదిని దాటిస్తారు కదా, దానికోసం అన్ని సంవత్సరాలు వృథా చేసుకొని భగవంతుడి నుండి నువ్వు పొందింది ఈ తుచ్ఛమైనదా?' అని అంటారు. నాడు సాధుసజ్జనులు, మునులుతోపాటు రాక్షసులు కూడా భగవంతుని కోసం సంవత్సరాల తరబడి ఘోరతపస్సులు చేస్తుండటం తెలిసిందే. అందరికీ వారు చేసిన తపములననుసరించి ఆయా దేవతలు ప్రత్యక్షం అవడం కూడా తెలిసిందే. సాధుపుంగవులు, ఇతర మునులు, యోగులు తదితరులంతా భగవత్ ప్రాపకాన్ని కోరుతుండటం కూడా తెలిసిందే. కానీ హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, రావణాసురుడు, కుంభకర్ణుడు వంటి రాక్షసులు కూడా ఇతర యోగులకు ఏమాత్రం తీసిపోని తీవ్ర భగవద్భక్తితోనే ఎంతో ఘోర తపస్సులాచరించారు. కానీ ఈ రాక్షసులు భగవంతునికి మారుగా, ఐశ్వర్యాన్ని, రాజ్యభోగాలను, ఎక్కువ కాలం సుఖాలలో తేలియాడాలన్న కాంక్షను కోరికలుగా చేసుకొని, వాటినే యాచించి, జీవిత కాలమంతా క్షణకాలంపాటు కూడా మనశ్శాంతి ఎరుగక చివరకు మరణాన్ని ఆశ్రయించారు. సద్గ్రంథ పఠనం వల్ల తెలిసిన, గ్రహించుకున్న దానికి అనుగుణంగా వర్తించేందుకు ఉపకరిస్తే అది **స్వాధ్యాయం** అవుతుంది. లేనప్పుడు కేవలం చదవడం అవుతుంది. మన పూజ, ఆరాధన అంతా ఆయన కోసమే కావాలి. అప్పుడు ఎక్కడలేని మనశ్శాంతి మనలను ఆవరిస్తుంది.

బాబా మనకు అందించిన మూడింటిలో మొదటిది **'పని చేయి'..** చేసే పనిని ఎలా చేయాలో చేసి చూపుతున్నారు గురువుగారు. మనం మరువకూడని మరో అంశమేమిటంటే– భగవంతుడినే కాంక్షించడం వలన సమస్తాన్నీ వదలివేయాలన్న అపోహను వీడాలి. నువ్వు తిను, తిరుగు, వ్యాపారం చేయి, ఉద్యోగం చేయి, వివాహం చేసుకో, పిల్లలను కను, డబ్బు సంపాదించు, భవనాలు నిర్మించుకో, రోగాలకు మందులేసుకో, ఇతరత్ర మరేమైనా చేసుకో... కానీ అవే లక్ష్యం కాకుండా, వాటి కోసమే జీవితమన్నట్లుగా కాకుండా కర్మానుసారం అడుగులు వేయి. భౌతికంగా ఎప్పుడు, ఎవరు ఏది వీడిపోతుందో పోనివ్వాలి. పోయిన దాని గురించి బాధ, దిగులు, లేనిదాని కోసం ఆరాటం తపన ఉండకుండా జీవితాన్ని కొనసాగించడం. అప్పుడు ఏది నిన్ను అంటదు. అప్పుడు అన్నింటిని వదులుకున్నట్లు లెక్క. అప్పుడు మాత్రమే భగవంతునికి చెందినవారమవుతాము, ఇందుకు శ్రీశ్యామాచరణ్ లాహిరీ మహాశయులను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బాబా చరిత్రలో దీక్షిత్‌ని చూడవచ్చు. ఒక







**గురువుగారితో కలిసి పరమాచార్య స్వామివారిని దర్శించుకున్న భాగ్యశాలి డా॥ శ్రీనివాసులురెడ్డిగారు.**

చెన్నైకు చెందిన ఒక ధనవంతుడు పరమాచార్య స్వామివారు ఎక్కడ మకాం చేస్తే అక్కడకు వెళ్లి దర్శించుకునేవారు. తిరునల్వేలిజిల్లా పాపనాశంలో మకాం చేస్తున్న సమయంలో స్వామివారి దర్శనానికి వెళ్ళినపుడు స్వామివారి బస బయట ఒక అంధ దంపతులు భిక్షకోసం అర్థిస్తే వారిని తూలనాడడమేకాక కొట్టాడు కూడా! స్వామి ఎలా దర్శిస్తారో, సాక్షిగా ఎలా గమనిస్తారో ఈశ్వరునికే ఎరుక. అందరికీ ప్రసాదమిస్తూనే ఇతనిని మాత్రం చివరివరకు ఎదురు చూసేలా చేశారు. ఎంతో కోపంగా బయట భిక్షకులతో ప్రవర్తించిన తీరును ప్రశ్నించారు. "నేను ఏమీ ఇవ్వను అని ఒక్కమాట చెబితే సరిపోయేది. కానీ నీవు వారిని దుర్భాషలాడటమేకాదు, వారిని తన్నావు. నీవు చేసిన ఈ పాపానికి నిష్కృతి లేదు." అన్నారు. కన్నీళ్ళతో క్షమాపణలు కోరుతూ "నేను చాలా పెద్ద అపచారం చేశాను, నన్ను మన్నించి రక్షించమని" వేడుకుంటే మృదుస్వరంతో "ఇక్కడే ఉన్న పాపవినేశ్వరస్వామిని సేవించి పూజించు, నీ పాపానికి పరిహారంపొందు" అని చెప్పి అదే రోజు రాత్రి స్వామి వారే పాపవినేశ్వరునిగా దర్శనమిచ్చి "ఆ అంధ కుటుంబానికి నీకు చేతనైనంత సాయం చేయి. అదే నిన్ను పరమపదం చేరుస్తుందని" అని అభయమిస్తే, ఆ దంపతుల చేతులు పట్టుకుని క్షమాపణలనడిగి తన ఇంటికి తీసుకెళ్ళి చూపు వచ్చే శస్త్రచికిత్సలు చేయించి, ఇరవై లక్షల ధనాన్ని వారికిచ్చి తన తప్పును సరిదిద్దుకున్నాడు. తరువాత కాలంలో ఆ కుటుంబం ఈజిప్టులో స్థిరపడ్డారు.

ఇలాంటి వృత్తాంతమే శ్రీసాయిచరిత్రలో నానా ఇంటికి వచ్చిన భిక్షగత్తెతో తాను ప్రవర్తించిన తీరు, అంతకు ముందే శ్రీసాయి చెప్పిన మాటలు పాటించని, భిక్షగత్తెను కోపించిన నానాతో బాబా "ఆ రోజు ఆ బిచ్చగత్తె మరికాసేపు నీ వాకిట ఉంటే నీకేం నష్టం వచ్చింది? గెంటిస్తానని చెప్పి అరవడమెందుకు? నెమ్మదిగా చెబితే ఆమె వెళ్ళిపోయేది కదా! అన్న సాయీశ్వరుని లీలా సంస్కరణ, సిగ్గుతో తలవంచుకున్న నానా, "బాబా క్షమించండి. ప్రమాణం చేసి చెపుతున్నాను. ఇకపై ఎప్పుడూ ఇలాంటి పొరపాటు చేయను" అని ఎంతో పశ్చాత్తాపంతో వేడుకోవడం మనకు గురుతుకు రాకమానదు.

**సంస్కరణ, ఉద్ధరణ హృద్యంగా కొనసాగుతున్నా – ప్రస్తుత సందర్భంలో గమనించవలసిన**




ఆకాశానికి ఎల్ల ఎక్కడో చెప్పడం ఎంత కష్టమో ఆ మహాపురుషుని అనంతలీలా విశేషాలను కొన్ని పదాల్లో, మరికొన్ని పుటల్లో పంచుకోవాలనుకోవడం అంతే అవివేకం. ఈ చిరు ప్రయత్నానికి ఊతం కేవలం గురుచంద్రులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ అనుగ్రహ ఆశీస్సులు మాత్రమేనని సవినయంగా తెలియచేసుకుంటూ కంచి కథలోనికి వెళ్దామా!

ఆంధ్రదేశంలో శ్రీతాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారు గొప్ప తపస్సంపన్నులుగా, బాలాత్రిపురసుందరి ఉపాసకులుగా సుపరిచితులే. వారు పెరిగిన ఆశ్రమాన్ననుసరించి ప్రజలు అనాచారంగా ఉండటాన్ని అసలు సహించలేక కనీసం నాలుగైదుసార్లు ఆత్మహత్య చేసుకుందామన్న ఆలోచన వచ్చేది. ఇలా అనుకున్నప్పుడల్లా పరమాచార్య స్వామివారు దర్శనమిచ్చేవారు. ఇలా వారి ఆత్మహత్యా ప్రయత్నం విరమించుకునేవారు. ఇలా ఉండగా ఒకసారి స్వామివారి దర్శనార్థం వెళ్ళిన శాస్త్రిగారిని "మీ సమస్య ఎంతవరకు వచ్చింది" అని అడిగారట పెద్దస్వామివారు. "ఏ సమస్య" అంటే "మీరు చేసుకోదలచిన ఆత్మహత్య సమస్య" అనడంతోనే వారు ఆశ్చర్యపోతూ "ఆ సమస్య దానంతట అదే తీరిపోయింది మీ అనుగ్రహం చేత" అని అన్నారు. వారికి ఒక శాలువా కప్పి "మీకు ఏ అనాచారము అంటనట్లు ఈ శాలువా కప్పుతున్నాను" అని చిరునవ్వుతో దీవించారు. **గురుఅనుగ్రహరక్షావస్త్రం ధరించాక అనాచారానికి ఆస్కారమెక్కడిది? మనలను మనం కోల్పోయే అవకాశమెక్కడిది? భగవంతుని సర్వసాక్షిగా భావిస్తాం. గురువు సర్వవేళలా మనోసాక్షి. అంతరంగపు ఆదిమూలంలో సింహాసనస్థితుడై ప్రతి ఆలోచనను పర్యవేక్షిస్తాడు.**

డా॥ శ్రీనివాసులురెడ్డిగారు మా గురుదేవులు పూజ్యబాబూజీ గారికి ఒక స్నేహితునిగా దగ్గరయి, వారి సాన్నిధ్యపు స్పర్శతో సద్గురువుగా భావించిన రోజులవి. డాక్టరుగారి ఒక అనుభవం పూజ్య గురుదేవులతో.... "ఒక సందర్భంలో ఒక తప్పు చేసి, ఆ తప్పును కప్పిపుచ్చుకుంటూ గురువుగారి దగ్గర ఏవిధంగా అబద్ధం చెప్పాలా అని నేను ఆలోచిస్తున్న సమయంలో గురువుగారు **"మీ సోర్స్ ఆఫ్ థాట్‌కన్నా లోతులో నేను ఉన్నాను"(జాగ్రత్త అన్నట్లు)** వేలు చూపిస్తూ తీవ్రస్వరంతో అన్నారు. వారు ఎప్పుడూ నాతో అలా మాట్లాడలేదు. ఒక్కసారిగా అలా అనేసరికి నాలో వణుకుపుట్టి మనస్సు స్తబ్దమయింది. నా అంతరంగంలో నా ఆలోచనకు రూపు ఏర్పడకముందే నేను చేస్తున్నది తప్పు అని తెలుపగల వారి సర్వజ్ఞతకు అవాక్కయ్యాను." **తరాలు, వివరాలు మారాయిగానీ గురువనుగ్రహ పరంపర, ఆశ్రితకోటి అంతరంగాన్ని పరి'పాలిం'చే లీలా తరంగం కొనసాగుతూనే ఉంటుంది.**





ప్రక్క కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే. మరో ప్రక్క ఆధ్యాత్మిక సాధనలు కొనసాగిస్తుండటం విశేషం. ఎట్టి ఒడిదుడుకులు లేకుండా!

ప్రహ్లాదుడు, మార్కండేయుడు తదితరులెందరో కేవలం భగవంతుని మాత్రమే కాంక్షించడం వలన ఆయన ప్రాపకం పొందడమే గాక, లౌకికపరమైన కష్టాలను అధిగమించగలిగారు. కోరికలు తీరడం, కష్టాలు తొలగడం మాత్రమే ఆశించి భగవద్భక్తి చేస్తే అవి అప్పటికి తొలగినా, మనలోని రాగద్వేషాల వల్ల మళ్ళీ మళ్ళీ రకరకాల కోరికలు, వాటికి అనుగుణంగా బాధలు, కష్టాలు పుట్టుకొస్తూనే ఉంటుంటాయి అంతమనేది లేకుండా! అదే భగవంతుడినే కాంక్షిస్తూ చేసే సాధనల వల్ల కష్టాల, బాధల గాఢత తగ్గటమో, పూర్తిగా నశించడమో జరుగుతుంది. అంతేగాక కోరికలు పుట్టుకురాని స్థితి కలుగుతుంది. అంటే–జ్ఞానం కలుగుతుంది. తనతోపాటు అంతా భగవన్మయమన్న జ్ఞానం ఉదయించినప్పుడు అన్నింటితో ఉంటున్నా, అందరితో నడుస్తున్నా, ఏమి జరుగుతున్నా, తనకు భిన్నంగా మరేమీ గోచరించదు కాబట్టి, అప్పుడు కోరికలకు, బాధలకు, కష్టాలకు రూపముండదు, స్థానముండదు!

"బాబా ఎన్నడూ ఇహాన్ని నిరసించలేదు. తన భక్తుల పారమార్థిక జీవితంపట్ల మాత్రమే తన బాధ్యత అంటూ, వారి ఐహిక (ప్రాపంచిక) జీవితాన్ని పట్టించుకోక నిర్లక్ష్యం చెయ్యలేదు. తన భక్తుల ఇహపరాల భారం తామే వహిస్తూ, వివిధ తరగతుల ప్రజలను, వారి వారి సంస్కారాలకు పరిణతికి అనుగుణంగా లాలించి బుజ్జగించి బోధించి తీర్చిదిద్దడమే బాబా యొక్క ప్రత్యేకత! "నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే వుంటాను! నేను ఇవ్వదలచింది వారు అడిగేంతవరకు!" – అని బాబా అందుకే అనేవారు! మనం కోరే వివిధ ప్రాపంచిక కోరికలను ఆయన తీరుస్తూనే వుంటారు. ఎప్పటివరకు? మనలో పరిణతి కలిగి ఆయన ఇవ్వదలచుకొన్నది మనం కోరేంతవరకు! కానీ, మానవుని కోరికలకు అంతమెక్కడ? 'కడలుడిపి నీరాడగా' అన్నట్లు ఆ కోరికలన్నీ తీరి, బాబా ఇవ్వదలిచినదేదో దాన్ని మనం కోరేదెప్పుడు? ఇదసలు జరిగేదేనా?–అనే సందేహం సాయిభక్తిరసం యొక్క రుచి తెలియని కొందరు బుద్ధిమంతులకు కలుగవచ్చు. బాబా కేవలం మన కోరికలు తీర్చటం మాత్రమే కాదు– వాటిని ఒక క్రమంలో, చక్కటి సంఘటనల కూర్పుతో మనకు అందించి, మన అంతరంగం వాటివల్ల సరైన పంథాలో ప్రభావితమయ్యేట్లు కూడా చూస్తారు. ఎవరికి వారు తమతమ అనుభవాలను జాగ్రత్తగా విశ్లేషించి సమీక్షించుకొంటే, శ్రీసాయి కేవలం **'వర'**దైవమే కాదు, **'పర'**దైవం కూడానన్న సత్యం బోధపడగలదు.

అంతేకాదు, ఇహపరశ్రేయోదాయకమైన సాయిభక్తి **'యోగం'** యొక్క అపూర్వ ప్రాశస్త్యం కూడా అవగతం కాగలదు!" (సాయిభక్తి సాధనా రహస్యం – శ్రీబాబాజీ)



"జీవితం కోసం ఇంకొకటి" (జీవితంలో సాధన భాగం) అంటే, నశింతువు. "ఇంకొక దాని కొరకు జీవితం" అంటే, (సాధనలో జీవితం భాగం) వైభవం పెరుగుతుంది. ఇదియే స్వర్గములో నుండుట. స్వర్గము ఒక స్థితి గాని చోటు గాదు. ఇది ఎక్కడ కల్పించుకుంటే అక్కడ ఉండవచ్చును అంటారు మాస్టర్ ఇ.కె.గారు. **సంకలనం: గురుకృప**

**అందరం కలిసి సాయిపథంలో ఉద్యమిద్దాం... పట్టు సడలింపని ప్రయత్నశీలతే నిష్ఠ**

"ఉత్సవం...ఉత్సాహం"...."వ్యక్తి...ఆదర్శం"...గుడికి, గురువు దగ్గరకు ఎందుకు వెళుతున్నాం? "ఆయన ఉంటే పనులవుతాయి అన్న స్థితినుండి కార్యక్రమరూపంలో ఆయన ఎప్పుడూ మనలో ఉన్నారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించడమే మనము ఆయనకు చేయవలసిన **అర్చన.** "వ్యక్తి లేకపోతే ఉద్యమానికి విస్తృతి రాదు. వ్యక్తిపైన ఆధారపడితే ఆ ఉద్యమం ముందుకు సాగదు. కనుక వ్యక్తి ఉండాలి. అతణ్ణి మనం ఆదర్శంగా స్వీకరించాలి తప్ప అతనిపై ఆధారపడకూడదు. **ఆధారపడే స్థితినుండి ఆదర్శంగా స్వీకరించే స్థాయికి ఎదిగిరండి!** మాస్టర్ జ్వాల్‌కూల్ ఇద్దరి గురువులవద్ద శిక్షణను పొంది నేడు విశ్వప్రణాళికలో తమ పాత్రను దీప్తిమంతంగా పోషిస్తూ ఉన్నారని దివ్యజ్ఞాన వాఙ్మయం చెబుతూ ఉన్నది. అలాగే మనకు కూడ బాబా-గురువుగార్ల దగ్గర ఏకకాలంలో శిక్షణ పొందే అవకాశం లభించింది. ఇప్పుడు మనం బాబా చెప్పిన విశ్వవిశాల దర్శనానికి, గురువుగారు అందించిన క్రమబద్ధమైన జీవన విధానానికి జత కలిపే ప్రయత్నం చేయాలి – విశాల దర్శనంలేని క్రమశిక్షణ విజయం సాధించదు. క్రమశిక్షణ లేని విశాలదర్శనం రాణించదు. క్రమశిక్షణతో కూడిన విశాలదర్శనంతో మనమిప్పుడు కార్యాచరణకు సిద్ధం కావలసి ఉన్నది. ముగ్గు వేయడానికి, ముగ్గు పొయ్యడానికి తేడా చాలా ఉన్నది. వాకిట్లో ముగ్గు వేశాం అన్నప్పుడూ, వాకిట్లో ముగ్గు పోశాం అన్నప్పుడూ అర్థమెంత మారిపోతూ ఉన్నది? రెండుచోట్ల ఉన్నది ముగ్గే. దాన్ని పారబోసినప్పుడు అసహ్యం వేస్తున్నది. అదే ముగ్గును క్రమబద్ధంగా వేసినప్పుడు అందం ఉట్టిపడుతున్నది. పద్ధతిగా ప్రవర్తించడంలో అంత తేడా వస్తున్నది. బాబా అందించిన సమన్వయమనే ముగ్గును, గురువుగారు అందించిన క్రమశిక్షణతో లోకానికి రకరకాల రంగవల్లికలుగా తీర్చిదిద్ది మనం సమర్పించవలసి ఉన్నది. గురువుగారి ఆశ, ఆశయం, ఆకాంక్షను పరిపూర్ణంగా అమలు పరచబడేటంతవరకు విశ్రాంతిని కోరకుందుముగాక! మనకు పనిలోనే విశ్రాంతి. పనిని విడిచిన విశ్రాంతి అది విశ్రాంతి కాదు, సోమరితనం అవుతుంది. మనకు సుఖం, శాంతి, హాయి, విశ్రాంతి అన్నీ మనకు కర్తవ్య నిర్వహణలోనే!

**– సంకలనం : గురుకృప**






# గురుకృపాలహరి

**కలి కల్మషములు నివారించ, హృదయ కాఠిన్యము కరిగించ**
**ఈతి బాధలను తొలగించ, పరేశు ఉనికి సుజనులకందించ**
**ధరణిన మానుషరూపుడై, దైవమవతరించె, ప్రేమనుపంచ**
**జీవకోటి మనోమూలమున నిలిచె, ఈశ్వరకృపను వర్షించ...**

"నన్ను ఆనంద స్వరూపునిగా ధ్యానించు, అది సాధ్యపడకపోతే నా ఈ రూపాన్ని ధ్యానించు" అన్నారు శ్రీసాయి. సృష్టి పరిణామం మనుష్యునికి అర్థం కావడం ఎంతవరకు సాధ్యం. అసలు అవగతం చేసుకోవాలని తలపు కలగడం జరిగే పనేనా? ఏ మహోన్నత కొనసాగింపు కోసమో, మరే మహోన్నత ముగింపువైపుగానో కొనసాగుతున్న ఈ సృష్టి కార్యాన్ని మస్తిష్కం కలిగిన ఏకజీవి మానవుడు తెలుసుకోగలడా? తెలుసుకోగోరతాడా? ఈ ఉత్సుకతను కోల్పోతున్న జాతిని మేల్కొలిపేందుకు దైవమే గురుస్వరూపంగా మన మధ్యన సంచరిస్తున్నట్లు స్పష్టంగా ద్యోతకమవుతుంది. ఈ అవ్యాజ ప్రేమప్రక్రియ గురుపరంపరగా కొనసాగుతుండే క్రమంలో అత్యున్నత త్యాగాన్ని, అనంత జ్ఞానాన్ని, అవిరామశ్రమను, అఖండతేజాన్ని సువ్యక్తం చేస్తూ అవనిన అలరారుతారు జగద్గురుచంద్రులుగా. మరో విషయం ఏమంటే మానవజాతికి వలసిన ఒక సానుకూల దృక్పథాన్ని కూడా తరతరాలకు అందజేస్తారు వారి జీవన గమనంతో. "మనిషి దైవంగా ఎదగడమన్న" శ్రీసాయి వంటి మహాత్ముల అభి'మతా'నికి శాశ్వతత్వాన్ని ప్రసాదించేది, భగవంతుని ఉనికిని సదా ప్రసాదించేది మహాత్ముల జీవితమే కదా. జగద్గురువుల ప్రతీ అడుగు, ప్రతీచర్య, ప్రతీమాట భగవంతుని సన్నిధిని స్పష్టంగా ఎరుకకు తెస్తుంది. జనసామాన్యానికి ఆ మహాత్ముల చర్యలు మహిమలుగా అనిపించవచ్చు కానీ, ప్రత్యక్ష అనుభూతిని పొందిన ఆశ్రితునిలో కలిగే పరివర్తనను గమనిస్తే ఆ పరివర్తన రాబోయే తరాలకు సుప్రవర్తనా మార్గంగా విలసిల్లగలదని అవగతం అవుతుంది.

ఏ మహాత్ముని చరిత్ర అయితే 'గురుకృప'తో దశాబ్దకాలంగా పంచుకుంటున్నామో వారిని తలచుకోవడం కూడా మద్గురుచంద్రుల మార్గంలో మరొక అడుగు వేసేందుకు దోహదపడేదే. ఈ 'శతాబ్ది సన్యాసి'గా 'దలైలామా' వంటి వారిచే కొనియాడబడిన శ్రీచంద్రశేఖర సరస్వతీ స్వామివారి మానవతా విశేషాలను గత సంచికలో గుర్తు చేసుకుంటే, ఈ సంచికలో వారి దివ్యత్వాన్ని సూర్యచంద్రులను మనం ఎంతగా అనుభూతి చెందుతామో, అంతే తేటగా దర్శించుకుందాం.



ఇది అనుభవైకవేద్యం. నామం చెబుతాం. శబ్దం వినిపిస్తుంది. మన రూపంలాగా రూపం కనిపించదు.

◆ నామస్మరణతో మనసును పదేపదే భక్తిపూర్వకంగా సాధనలో ఉంచుతుంటే దేహమంతా ఆధ్యాత్మిక తరంగ ప్రవాహంగా మారిపోతుంది. నామస్మరణ చేయగా చేయగా వెదురు ముక్క లాంటి శరీరం వేణువవుతుంది. బృందావనంలో శ్రీకృష్ణుడు ఆలపించిన నాదమవుతుంది. ముల్లోకాలూ తిరిగి, 'నారాయణా! నారాయణా!' అని స్మరించే నారదుడి చేతిలో తంబుర అవుతుంది.

◆ భక్తి, ప్రేమలను నింపి చేసే నామస్మరణకు మించిన యోగం లేదు. గురు అనుగ్రహం వల్ల ఆ భాగ్యం కలుగుతుంది. దాన్ని దక్కించుకున్నవారు తుకారాం, త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు, ప్రహ్లాదుడు లాంటి భక్తులు. వారే సజీవ సాక్ష్యంగా కాలంలో నిలిచి నామ మహాత్మ్యాన్ని విశ్వానికి వెల్లడించారు. పురాణాల్లో, శాస్త్రాల్లో చదివాం ఆ మహానుభావుల గురించి. మనం కూడా అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. అందుక్కావల్సింది సాధనయే.


◆ పూజ కోసం సామగ్రి కొనాలి. ఎన్నోకొన్ని నియమాలు పాటించాలి. వ్రతాలకూ, నోములకూ ఐతే కఠోరమైన నియమాలుంటాయి. యజ్ఞాలకూ, క్రతువులకూ శక్తియుక్తులుండాలి. శాస్త్రం తెలిసి ఉండాలి. దోషరహితంగా చెయ్యాలి. మరి నామస్మరణకో! ఎక్కడ ఉన్నా ఏ పని చేస్తున్నా మనసును లగ్నం చేసి నామం స్మరించుకోవచ్చు. పనికి ముందూ, పనులు చేస్తూ, పని తరువాత నామస్మరణ చేస్తూ ఉంటే ఆ చేసే పని పవిత్రమవుతుంది. అందులోని దోషాలు హరించిపోతాయి. ఆ విధంగా చేసే కర్మ భగవదర్పణ కర్మ అవుతుందని భగవద్గీత చెబుతోంది. అందుకే కలియుగంలో నామస్మరణను మించింది లేదని చెప్పారు.

◆ తేనెను పాలల్లో కలుపుకొన్నట్లు – భయంలో, బాధలో, సుఖంలో, సంతోషంలో, జీవితంలో నామాన్ని కలుపుకోవాలి. దైవం ఎప్పుడూ మనతో కలవడానికి త్వరపడుతూనే ఉంటాడు. నామస్మరణ ఈ రోజు మొదలుపెడితే ఇప్పుడే ఆయన మనకు చేరువవుతాడు.

◆ **నిరంతర భగవన్నామ స్మరణమే** ఆధ్యాత్మిక జీవితానికి బంగారుబాట. సర్వకాల సర్వావస్థల్లోనూ భగవన్నామ స్మరణ చేయవచ్చు. విధివిధానాలూ, నిషేధాలూ లేనేలేవు.

**– సేకరణ : గురుకృప**





**ఇతరులతో పోల్చుకోవడంవల్ల. మనం ఎలా నష్టపోతామో తెలిపే హాస్యకథ!**

నువ్వు సత్సంగానికి బాబా కోసం పో. వాళ్ళు ఎన్ని గంటలకు వస్తారనే దాని మీద దృష్టి నీకెందుకు? నీకేమిటి సంబంధం? బాబా దగ్గర గంటసేపు కూర్చోవాలనే ఇంటరెస్ట్ ఉండేవాళ్ళు వెళ్తారు. ప్రక్కనవాడు ఎన్ని గంటలకి వస్తున్నాడు. వాడు లాస్ట్ వస్తున్నాడా, పోతున్నాడా అనే దానిమీద దృష్టి పెట్టకండి... పచ్చిగా చెప్పాలంటే, **mind your own business**. అంతే! మన బిజినెస్ ఏమిటి? బాబా మీద ఫోకస్ చెయ్యడం. ఫోకస్ చెయ్యండి అంతే. ప్రక్కనవాడు ఎప్పుడు వస్తున్నాడు. వాడు ఏమేమి చేస్తున్నాడు... మనకెందుకు? మనకేంటి సంబంధం అసలు? ఆలోచించకండి.

మనం దాంట్లో interfere కావద్దు. ఎవరెవరు ఎక్కడ నిలబడాలి. ఎక్కడ కూర్చోవాలి. interference వద్దు. మన దృష్టి బాబా మీద పెట్టండి, అంతే. తెలియనటువంటి complaining voice ఏర్పడుతుంది దాంట్లో, ఈ complaining ఎందుకొస్తుంది? మనం రైట్ చేస్తున్నాం. ప్రక్కన వాడు తప్పు చేస్తున్నాడు అనేటువంటి ఫీలింగ్ రావడం వల్లే కలుగుతుంది. ప్రతి ఒక్కడూ అలాగే అనుకొంటుంటాడు. నేను కరెక్టుగా చేస్తున్నాను, ప్రక్కనవాడే తప్పు చేస్తున్నాడు అని. వాడి తప్పు మీదనే బుర్రపెడుతున్నాం. ప్రక్కనవాడి లోపాలు వెతకడానికి ప్రయత్నం చేస్తున్నాం. అది బాబా ఎంత స్ట్రాంగ్‌గా తిట్టారో మీకు తెలుసు. ఆ పని మనమెందుకు చెయ్యాలి? ఆ **వరాహ**చర్య మనమెందుకు చెయ్యాలి? ప్రక్కనవాడి మీద దృష్టి పెట్టకండి. వాళ్ళేమి చేస్తున్నారో మనకొద్దు. మనం సత్సంగానికి వెళ్ళేది బాబా గురించి. బాబా మీద దృష్టి పెట్టండి. వచ్చేసెయ్యండి. అంతే. అందరూ అలాగే చెయ్యండి. అప్పుడు ఇబ్బంది లేదు. ప్రక్కన వాణ్ణి కరెక్ట్ చెయ్యాలి అనుకొనేటప్పటికి ఇబ్బందులొస్తున్నాయి.. మనమెవరం ప్రక్కవాణ్ణి కరెక్ట్ చేసేదానికి? సత్సంగాలు మీలో పాజిటివ్ థింకింగ్‌ని పెంచుతున్నాయా. తగ్గిస్తూ పోతున్నాయా? ఒక్కసారి ఆలోచించుకోండి. చూసేదానికి సత్సంగం పట్ల ఎంతో విపరీతమైన ఆర్తి, ఆసక్తి ఉన్నట్లుగా కనిపిస్తాయి. ఎంత దూప్ చేస్తున్నాయో మిమ్మల్ని అవి.

ఆ, వెళ్ళాము... గురువుగారు మాకు ఈసారి ఇంటర్వ్యూయే ఇవ్వలేదు. మాకు ఇంటర్వ్యూ అవసరమైతే గురువుగారిస్తారు. ఆయనకు తెలియదా? మీరెంతగా నన్ను చూడాలని అనుకొంటుంటారో. నిజంగా మీకంత ప్రేమ నా పట్ల ఉంటే, నాకు మీపట్ల అంత ప్రేమ



ఉండదమ్మా? మిమ్మల్ని చూడాలని నాకూ ఉంటుంది. ఎందుకో ఇవ్వలేదు. గురువుగారికి తెలుసు. నాకవసరమైతే ఇస్తారు. పిలుస్తారు. అంతే. పిలిచారూ, సంతోషపడాలి. పిలవకపోయినా... ఆయన దగ్గర కూర్చున్నాము, విన్నాము, వచ్చేశాము. అవి పోయాయి ఈ రోజున. వాళ్ళను పిలిచారే. మమ్మల్ని పిలవలేదు. ఇక్కడ పాయింట్ నన్ను పిలవలేదనేకంటే కూడా, వాణ్ణి పిలిచారు అనేది పెద్ద పాయింట్ అక్కడ. మెయిన్ బాధ అదన్నమాట అసలు. ఆఖరికి ఎట్లా తయారైపోయిందనంటే అదేదో కథ చెప్పినట్టుగా తయారైంది. సత్సంగాలు ఇప్పుడు చూస్తూ వుంటే, వాడికంటే మనదెప్పుడూ డబుల్ ఎక్కువ ఉండాలంతే, ఏదైనా సరే. వాడికి సత్సంగం ఇవ్వకపోయినా ఫర్లేదు. నాకివ్వలేదు కనుక వాడిక్కూడా ఇవ్వకూడదంతే. ఇవ్వకపోతే ఎవ్వరికీ ఇవ్వకూడదు. లేకపోతే ఇద్దరికీ ఇవ్వాలి. ఆ కథ తెలుసుగా మీకు? రెండు కళ్ళ సంగతి. (తెలియదు సార్), ఇద్దరు ఇట్లాగే.. తపస్సు చేశారట. ఒకరికొకరికి పోటీ అన్న మాట దాంట్లో. తపస్సు చేసిన తర్వాత, భగవంతుడు ఒకడికి ప్రత్యక్షమయ్యాడట. ఏం కావాల్రా? ఎందుకు ఇట్లా ఏడుస్తూ ఉన్నావు, ఏంటి నీ కథ? అన్నాడట. నా గురించి నాకేమీ తపన లేదు, భగవంతుడా ఆ ప్రక్కనవాడి గురించే నా ప్రాబ్లం అంతా కూడానూ.. నాకటువంటి స్వార్థాలేమీ లేవు. వాడిని ముందు అడగండి పాపం. వాడినడిగి వాడికి ఏది కావాలో, అదివ్వండి అన్నాడట. వాడికి ఏమిస్తే, దానికి డబుల్ ఇవ్వండి నాకు, అంతకంటే ఏమీ అవసరం లేదు. ఈయన వెళ్ళి వాడినడిగాడట, ఏరా, నీకేం కావాలి అన్నాడట. నా గురించి నేనేమీ ఆలోచించుకోవడం లేదు. వాడు ఏమడిగాడో చెప్పండి అన్నాడట. నువ్వు ఏమడిగితే (అది) వాడికి డబుల్ అడిగాడు, అంతకంటే ఏమీ లేదు అన్నాడట. అయితే భగవంతుడా, నాకు ఒక కన్ను తీసెయ్యండి అన్నాడట. వాడికి రెండు కళ్ళూ పోతాయి కదా, అది వీడి పాయింట్. అట్లా ఉంటుంది. ఎప్పుడూ దృష్టి ప్రక్కనవాడి మీదనే ఉంటుందన్న మాట మనకు. అందుకనే ఇందాక నేను చెప్పింది. ప్రక్కనవాడి మీద దృష్టి పెట్టకు. వాడు లేటుగా వస్తున్నాడా, ముందుగా వస్తున్నాడా, అది చేస్తున్నాడా, ఇది చేస్తున్నాడా, ఇవి మనకొద్దు. బాబా మీదనే ఫోకస్ చెయ్యండి.

**– శ్రీబాబూజీ అనుగ్రహభాషణాల నుండి**

**మీరు నా దగ్గరకు వచ్చినా మీరు పట్టుకునేది ఆయన్నే! నన్ను కాదు... నేను చెయ్యి ఇచ్చినట్టే ఇస్తా. కానీ, ఇచ్చేది మాత్రం బాబా కాలే.... పట్టుకునే సమయానికి అందేది మాత్రం బాబా కాలే! మీరు పట్టుకోవలసింది, నేను పట్టిచ్చేది బాబా కాళ్ళే! ఆయన పథమే ఇది. – శ్రీబాబూజీ**





నిరంతరం కొనసాగాలి. ఆయన వాక్కులు మనకు బుక్కులు కావాలి. నేటి అల్లోపతీ సోదరుల మీద కూడ ఈ బుక్కులు పనిచేయాలి. వారి మనస్సులు జిజ్ఞాసతో వారు హోమియో తత్వశాస్త్రానికి దగ్గర కావాలి. యిప్పటికే వున్న అనుభవంతో ఆ తత్వశాస్త్రం అందిస్తున్న వెలుగును అందుకోగలిగితే వారు సమాజానికి మరింతగా సేవను అందించగలుగుతారు".

బహుశా అల్లోపతీ వైద్యులు హోమియోపతీపైన దృష్టిని గాఢంగా ప్రసరింపజేయడానికే ఇటీవలి సన్నివేశాలన్నీ వస్తున్నాయని నేను అనుకుంటున్నాను. అనుమానించడంతో మొదలుపెట్టిన వీరు ఈ హోమియో వైద్యశాస్త్రాన్ని అవగాహన చేసుకోవడం వరకు ప్రయాణించాలని నేను కోరుతున్నాను. అందుకు కావలసిన చిత్తశుద్ధి, తీవ్రకృషి వీరి నుండి వ్యక్తం కాగలదని నేను విశ్వసిస్తున్నాను. అన్ని విధాలైన ప్రయత్నాలను క్రమంగా లోకశ్రేయస్సువైపుకే మళ్ళించగలగడం అనేది ప్రకృతిమాతలోవున్న ఒక నైపుణ్యం కనుక తప్పనిసరిగా యిప్పుడు జరుగుతున్న ఈ మథనం కూడ లోకశ్రేయస్సువైపునకే మళ్ళింపబడుతుంది. ఇది సత్యం. **– "హోమియో విధానము, ఒక అవగాహన నుండి"**

## నామస్మరణ మహత్యం

**నేను హరిని స్మరించి, హరినయ్యాను – శ్రీసాయిబాబా.**

- మనం వెలకట్టలేని సంపదలు రెండే రెండు – ఒకటి మనశ్శాంతి, రెండోది సంతృప్తి.
- ఈ రెండింటిని సంపాదించుకున్నవాళ్ళు ప్రతి క్షణం అఖండమైన ఆనందాన్ని అనుభవిస్తారు. కష్టపడనక్కర్లేదు సంపాదించుకునేందుకు.
- గురు (దైవ) 'నామస్మరణ' చేస్తే చాలు. ఆ వెలకట్టలేని రెండు సంపదలూ లభిస్తాయి.
- 'ఆధ్యాత్మికత' అనే సరస్సులో 'నామం' అనే రాయి వేస్తే శబ్ద తరంగాలు వెలువడతాయి. అవి మనసంతా వ్యాపించి శరీరమంతా నిండిపోతాయి.
- "ఏ నామాన్నయితే మనం స్మరిస్తున్నామో ఆ దేవుడికి సంబంధించిన రూపాన్ని మన మదిలో నిలుపుతాయి." నామమే 'ఆధ్యాత్మిక శబ్ద తరంగం'.
- "బెల్లం బెల్లం" అంటే, బెల్లం రుచి మనకు తెలియదు. "తేనె తేనె" అంటే కూడా తేనె రుచి మనకు తెలియదు కదా...! బెల్లాన్ని కొరికి తినాలి. తేనెను నోటిలో వేసుకొని చప్పరించాలి. అప్పుడే ఆ మాధుర్యం మన అనుభవంలోకి వస్తుంది.
- నిజానికి దైవనామం, దైవం వేరు కాదు. ఆ పేరు స్మరించగానే ఆయన మన దగ్గరుంటాడు.



మహాకావ్యంగా బోధించారాయన. నేటికీ 'హోమియో' వైద్యశాస్త్రంలోనికి ఎవరైనా-గ్రంథాల అధ్యయనం ద్వారా ప్రవేశించవలసిందే.

ఆయన తత్త్వశాస్త్ర ఉపన్యాసాలూ, మెటీరియా మెడికా ఉపన్యాసాలూ ఆంగ్లంలో గ్రంథాలుగా వెలువడి, హోమియో శాస్త్రాన్ని అధ్యయనం చేయదలచే వారందరికీ పారాయణ గ్రంథాలై ప్రకాశిస్తున్నాయి. ఇంతకూ ఆయన భార్య అనారోగ్యం అల్లోపతీకి లొంగకపోవడం ఆయనను అంతవాణ్ణి చేసింది. కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యగారు కూడా చిత్రంగా ఈ హోమియో వైద్య రంగంలోనికి ప్రవేశించారు. వస్తుతః ఆయన ఒక మహా కవి. ఒక మహాప్రవక్త. ఒక చిత్రమైన సన్నివేశంలో ఆయన ఒక ఘన హోమియో వైద్యునిగా కూడ రూపొందారు. వారి రెండవ అబ్బాయికి ప్రబలమైన మూర్ఛవ్యాధి వుండేది. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లొంగలేదది. చివరికి ఎవరో చెప్పారు. హోమియోలో దీనికి నివారణ వుందని. అలా ఆయన హోమియోకు దగ్గరైనారు. బిడ్డకు హోమియో వైద్యం ప్రారంభించడంతో పాటు ఆయన హోమియో అధ్యయనాన్ని కూడ ప్రారంభించారు. అచిరకాలంలోనే ఆయన ఒక మహాద్రష్టగా రూపొందారు. తన బిడ్డకు తానే నయం చేశారు. తన చెంతకు వచ్చినవారందరికీ స్థిరమైన స్వస్థతను అనుగ్రహించసాగారు. ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షలమంది రోగార్తులను ఆయన స్వయంగా సేవించారు. కొన్నివేల మంది హోమియో వైద్యులను ఆయన తన వెలుగుతో రూపొందించారు. మానవజాతికి యిలా ఈ వైద్యసేవ జరుగుతూ వుండాలి. తరతరాలు యిది కొనసాగుతూనే వుండాలి- అని సంకల్పం చేశారాయన. అది ఒక మహా సంకల్పం. ఆ మహాసంకల్పంనుండి వ్యక్తమైన ఒక ప్రత్యేకమైన ఉద్యమమే ఈ మానవ ధర్మ శిక్షణ సంస్థ ద్వారా నేడు దివ్యోత్సాహంతో నిర్వహింపబడుతున్నది. హోమియో వైద్యశాస్త్రంలోని సూక్ష్మాతి సూక్ష్మమైన లోతుపాతులను ఈ ఉద్యమం సామాన్య మానవునికి కరతలామలకం చేయగలుగుతున్నది. బోధన తరగతుల ద్వారా హోమియో ఎడల శాస్త్రీయమైన అవగాహనను జనబాహుళ్యంలో పెంచుతూ వస్తున్నది.

కృష్ణమాచార్య అనేవారు "ఈ హోమియో విధానం రోగార్తునికి శాశ్వతమైన నివారణను అందిస్తున్నది. ఆ అందిస్తున్నందుకు అది చాలా స్వల్పమైన మూల్యాన్నే రోగార్తులనుండి అపేక్షిస్తున్నది. ఈ రెండు కారణాలను దృష్టిలో పెట్టుకొని, మనం ఆ హోమియో వైద్యసేవను విజయవంతం చేయాలి. అందుకు వందలు వేలుగా హోమియో వైద్యులను రూపొందించగలగాలి. ఈ కృషి



## పూజ్య శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలు



**22 జనవరి 2004, శిరిడీ**

**(గత సంచిక తరువాయి) :**

**భక్తుడు** : ఎట్లా సార్?

**గురువుగారు** : ఎన్నో ఉన్నాయి పద్ధతులు. వాటిల్లో నేను ఒక పద్ధతి చెప్తాను. మీకు బాబా నామం అంటే ఇష్టం. బాబా నామం తీసుకొని రోజుకి ఒక్క గంట, గంటకి ఎన్ని నామాలు చేయగలను అని లెక్కేసుకోండి.

**భక్తుడు** : అప్పుడు కౌంటింగ్ మీదకే మనసు పోతుంది కదా సార్!

**గురువుగారు** : గంటకి ఎన్ని నామాలు చేయగలమో, ఒక్కసారి అనుకోవాలి. అనుకొని... మనం ఒక లక్ష అనుకున్నాం, పది లక్షలనుకున్నాం. గంటకి ఇన్ని చేయాలి అని గంటలు లెక్కేసుకోండి. ఒక గంట కూర్చోండి చాలు. మీరేమీ కూర్చొని జపమాల పట్టుకొని తిప్పాల్సిన అవసరంలేదు. తక్కువైనా, ఎక్కువైనా ఏం ఫర్వాలేదు. ఆ లెక్క ఇంపార్టెంట్ కాదు. ఇది, ఈ రకంగా చేయడంవల్ల మీకేదో బాబా అనుగ్రహం వచ్చేస్తుంది, మీ కష్టాలు తీరుతాయని కాదు. ఇదేదో సాధనా మార్గం, దీనివల్ల ముక్తి వస్తుందనీ కాదు. దీనివల్ల, మీకు బాబా పట్ల ఉండేటువంటి ప్రేమను వ్యక్తం చేసేదానికి అడ్డంగా ఉండే మానసిక బలహీనతలు మాత్రమే పోతాయి. ఇక అంతకుమించి ఏమీ లేదు. అందుకోసమే చేయాలి. అదేం లేదు, మాకు బాగానే ఉందంటారా, అవసరం లేదు. ముందు ఒక టైంలో కూర్చోండి. నెక్స్ట్ మళ్ళా ఒక లక్ష, పది లక్షలైన తర్వాత ఇంకో టైం తీసుకోండి. మళ్ళా ఇంకో టైం తీసుకోండి. ఒక్కొక్కరి టైంను బట్టి, వాళ్ళు చేసే ఉద్యోగాలను బట్టి, చదువును బట్టి.

**భక్తుడు** : నామం చేస్తున్నప్పుడు కాన్సెంట్రేషన్ బాబా మీద ఉండటం లేదండీ నాకు!

**గురువుగారు** : ఉండదు. నెమ్మదిగా చేస్తూ చేస్తూ పోతే వస్తుంది. ముందు ఉండదు. ముందు ఉంటే అసలు చేయడమెందుకు? దానికోసమే చేయడం. మనకు కాన్సెంట్రేషన్ కావాలనే నామం చేస్తాం. కాన్సెంట్రేషన్ లేదు కదా అని నామం చెయ్యకుండా ఉంటే ఏం ఉపయోగం? కానీ, నేనిప్పుడు చెప్పేదేమిటంటే, కాన్సెంట్రేషన్ అంటే అదేదో, గురువుగారు ఈ సాధనా పద్ధతి చెప్పారని మాత్రం అనుకోవద్దు. సాధనా పద్ధతి కాదిది. అది నీ మనసు పట్ల నీకు నిగ్రహం. ఒక గంటసేపు కదలకుండా కూర్చోగలగాలి. మనసును ఒకదాని మీద పెట్టగలగడం అనేటువంటిది అలవాటు చేసుకోవడం,



అంతవరకే! దానికి, మీ కష్టాలకి, మీకు రాబోయేటువంటి ఆధ్యాత్మిక స్థితికీ ఏం కనెక్షన్ లేదు. అది వచ్చేదెటూ వస్తుంది. అది మీరేమీ చేయకపోయినా చేస్తాను. అది కూడా చెప్తున్నాను. మీకేమీ ఎట్రాక్షన్ పెట్టి ఇది చెయ్యడం కాదు.

**భక్తుడు :** నామం అంటే ఏ నామం చెయ్యాలి?

**గురువుగారు :** మీకిష్టమొచ్చిన నామం చేసుకోండి. బాబాకు సంబంధించిన నామం, మీకెలా అనిపిస్తే అలా చేసుకోండి. ఏ నామమైనా బాబా నామమే. బాబా నామమే చెయ్యండి.

**భక్తుడు :** సార్! నామం చేస్తుంటే, అంటే... సమాధి మందిరంలో బాబా దగ్గర ఉన్నట్లు, అలాంటి ఆలోచనలు వస్తుంటాయి. అలాంటివి చెయ్యొచ్చా? లేకపోతే...

**గురువుగారు :** చెయ్యొచ్చు. తప్పకుండా చెయ్యొచ్చు.

**భక్తుడు :** బాబా నామం చెప్పుకొంటూంటే కొన్ని బాబా లీలలు గుర్తొస్తుంటాయి. అలాంటివి రావచ్చా, రాకూడదా?

**గురువుగారు :** రావచ్చు. బాబాకు సంబంధించి ఏమొచ్చినా, ఏం ఫర్వాలేదు. మధ్యమధ్యలో ఇంకేవైనా వేరే ఇతర ఆలోచనలు వచ్చాయి... ఛీ ఛీ, ఆలోచనలొస్తున్నాయని ఆ చెడ్డ ఆలోచనలు గురించి మళ్ళీ ఆలోచించకండి. అక్కడికి వదిలేయండి. వదిలేసి మళ్ళీ బాబా మీద పెట్టండి. మళ్ళీ పోతాయి, మళ్ళీ వస్తాయి, మళ్ళీ పోతుంటాయి.

**భక్తుడు :** ఈ లోపల నిద్ర వస్తుంది, గురువుగారూ!

**గురువుగారు :** నిద్ర వస్తే లేచేసి, మొహం కడుక్కొని కొంచెం అటూ ఇటూ గట్టిగా తిరిగేసి, మళ్ళా కూర్చోండి.

**భక్తుడు :** బాబా యాక్టివిటీలో ఉన్నామనుకోండి, ఉదాహరణకు ఇప్పుడు మేము డెకరేషన్ వర్క్ చేసుకుంటున్నాం, బాబా ఫోటోస్ క్లీనింగ్ చేసుకుంటున్నాం. మూడు, నాలుగు గంటలైనా కూడా మాకు టైం అసలు తెలియట్లేదు. ప్రత్యేకంగా కాన్సెంట్రేట్ చేయాలి అని మేము ప్రిపేర్ కాకుండానే నేచురల్‌గా కాన్సెంట్రేట్ అయిపోతుంది. అంటే అది, బాబా యాక్టివిటీలో... బాబా ఫోటోలు తుడవడంగాని, క్లీన్ చేసుకోవడంగాని, అంటే సత్సంగంలో ఏదైనా చేసుకోవడం... అది కూడా బాబా యాక్టివిటీ క్రిందకే వస్తుందా సార్?

**గురువుగారు :** వస్తుంది. అట్లా కాకుండా ఇట్లా కూడా చేయగలగాలి. పనుంటే ఇరవై గంటలూ





చేస్తున్న ప్రయత్నాలను మనం వ్యతిరేకించకూడదు. వాటికి మనం సహకరించాలి. సహకరిస్తే ప్రాణశక్తి బలపడుతుంది. దాని ప్రయత్నాలు బలపడుతాయి. వ్యాధికారణం అతి త్వరలో నిష్క్రమిస్తుంది. నాతోటి వైద్యులారా! ప్రాణశక్తి చేస్తున్న ప్రయత్నాలకు సహకరించడం ఎలాగో నాకు దర్శనం అయింది. ఆ సహకరించే విధానాన్ని నేను మీకు నేర్పగలను. కదలిరండి. అందరం కలిసి ఈ మంచి పనిని చేద్దాం" అని పిలుపు యిచ్చారు హానిమన్. క్రమంగా ఆయన పిలుపు ప్రపంచవ్యాప్తమైంది. వైద్యవిధానం పెద్ద మలుపు తిరిగింది. దీర్ఘవ్యాధులతో క్రుంగి కృశించి నశించిపోతున్న మానవాళికి ఒక సంజీవని దొరికినట్లయింది. ఆ విధంగా మానవజాతి మొత్తాన్ని సేదదీర్చగలిగారాయన, ఓదార్పును ఇవ్వగలిగారాయన. జాతికి అభయం పట్టగలిగారాయన. ఇదిగో నివారణమని అందిస్తే మానవజాతి ఆయన దర్శనానికి, సేవకూ పులకించిపోయింది. 'నీవు మనిషిని కావు. రెండవ క్రీస్తువు'– అంటూ చేతులెత్తి నమస్కరించింది.

నిజమే. ఆయన నిజంగా రెండవ క్రీస్తే. ఎందుకంటే– క్రీస్తు ఒకేసారి శిలువ గొట్టబడ్డాడు. అదికూడా ఆయన అంటే అర్థంకాని కొందరు దుండగుల చేత హానిమన్ మానవజాతి శ్రేయస్సుకోసం తనను తానే బలిదానమిచ్చుకున్నారు. ఒక్కొక్క విషద్రవ్యాన్ని ఔషధంగా నిరూపించడం కోసం దానిని తనమీద ప్రయోగించుకుంటూ, తనను తానే శిలువ కొట్టుకున్నారాయన. ఆయన రచించిన హోమియో తత్త్వశాస్త్రం 'ఆర్గనాన్' అన్న పేరుతో వెలువడింది. దానిని హోమియో బైబిల్ అంటారు. త్యాగము నుండే అమృతత్వం లభిస్తుంది అన్న వేదవాక్కు ఆయనపట్ల అక్షరాలా నిజమైంది. ఆయన తర్వాత హెర్రింగ్, ఎలెన్ వంటి మహా వైద్యులెందరో ఆయన అడుగుజాడలలో నడిచారు. ఆయన త్యాగ ఫలితాలను మానవజాతి అంతటికీ మరింత కండపుష్టితో అందేటట్లు చేశారు. ఇక ఆపైన సకల దేశాలలో ఎందరెందరో ఆయన అనుయాయులూ, ఆయన ప్రతినిధులూ అయినారు. మానవాళిని సేవిస్తూ వస్తున్నారు.

అమెరికా దేశస్థుడైన ఒక అల్లోపతీ వైద్యుడు– ఆయన పేరు జె.టి.కెంట్. చిత్రంగా హానిమన్ అనుయాయిగా రూపొందారు. ఆయన భార్యకు తీవ్రమైన అనారోగ్యం వుండేది. ఆయనకు తెలిసిన అల్లోపతీ వైద్యులందరూ అయిపోయారు. చివరికి ఒకానొక హోమియో వైద్యునివల్ల ఆమెకు అంతటి అనారోగ్యమూ నివారణమైంది. కెంట్ ఆశ్చర్యపోయారు. ఆత్మపరిశీలనలో పడ్డారు. అల్లోపతీలోని అపరిపక్వతను గమనించారు. హోమియో వైద్యశాస్త్రాన్ని ఉపాసించారు. హోమియో తత్వశాస్త్రంలో ఒక మహాద్రష్టగా రూపొందారు. ఆ వైద్యశాస్త్రాన్ని కొన్ని వందలమంది విద్యార్థులకు ఒక



## ప్రాణశక్తికి పలకరింపు

**(గత సంచిక తరువాయి)** "ఓ అల్లోపతీ వైద్యులారా! మీరు రకరకాల 'టెస్ట్'లు చేస్తున్నారు. కాని ఆ టెస్ట్‌లు మనిషిని మొత్తంగా పట్టి చూపించగలుగుతున్నాయంటారా? శరీరభాగాల నిర్మాణంలోని స్థితిగతులను మాత్రమే ఆ టెస్టులు చూపించగలవు. ఆ నిర్మాణంలోని వక్రతకు మూలకారణమైన వ్యాధి కారణాన్ని ఈ పరీక్షలు పట్టిచూడలేవు. కనుక ఈ టెస్టుల మీద ఆధారపడి వైద్యాన్ని చేసెయ్యడం ఎంతవరకు సబబంటారు?" అని హానిమన్ సూటిగా అడిగారు.

ఒకరోజు జరిగిన వైద్యుల సెమినార్లో హానిమన్ యిలా సూటిగా అడుగుతున్నప్పుడు అల్లోపతీ వైద్యులకు మూలాలు కదినట్లయింది. వారిలో కొందరు తట్టుకోలేక హానిమన్‌ను నిందించారు కూడా. వారు నిందిస్తున్నాసరే– ఆయన అందిస్తూనే వచ్చారు. "మీ మూలాలు కదిలి పోతున్నాయనుకోవద్దు. మనందరికీ కావలసిన మూలసూత్రాలు దొరుకుతున్నందుకు సంతోషించండి" అన్నారు.

"మనిషి కేవలం రక్త మాంసాల ముద్ద అని అనుకోకండి. నిజమైన మనిషి ఆ లోపల వున్నాడు. మనస్సు నుండి ఆపైన వున్నాడు. కనిపించే మనిషిని చూస్తున్నారు. అనిపించే మనిషినికూడా కలుపుకోండి అంటున్నాను నేను. అనిపించే మనిషిలో వ్యాధి కారణం వుంటుంది. కనిపించే మనిషిలో ఆ వ్యాధి ఫలితాలు వర్తిస్తూ వుంటాయి" అని ఆయన మహాఉపదేశం చేశారు. "మందు రోగికి వేయండి, రోగానికి కాదు అన్నారాయన. రోగి దేహాన్నే కాక రోగి జీవిత విధానాన్ని కూడా కూలంకషంగా పరిశీలించాలి" అన్నారాయన. ఆ జీవిత విధానంలోనే రోగకారణం దాగి వుంటుంది. దాన్ని గమనించగలగాలి, అక్కడివరకూ మనం వెళ్ళాలి. మల మూత్రాదుల పరీక్షలతో మనం ఆగకూడదు, నిత్య జీవితంలో ఆ మనిషి ప్రవర్తన వరకూ మనం సాగిపోవాలి అని హెచ్చరించారాయన. ఆ సాగిపోవడం ఎలాగో సూత్రీకరించి చూపించారు కూడా. దానిని హోమియోలో రోగి యొక్క కేస్‌షీట్‌ను నిర్మాణం చేయడం అంటారు. నిజానికి కేస్‌షీట్ నిర్మాణం అన్నది ఒక మహాతపస్సు. "ఓ అల్లోపతీ వైద్యులారా! వ్యాధిని బహిష్కరించడానికి ప్రాణశక్తి ప్రయత్నాలు చేస్తున్నది. నిజానికి రోగి అనుభవిస్తున్న వేదనలన్నీ ప్రాణశక్తి చేస్తున్న ప్రయత్నాలే. తెలియక మీరు ఆ ప్రయత్నాలనే వ్యాధులు అనుకొంటున్నారు. ఆ ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నారు. వాటి వెంటపడి వేటాడుతున్నారు. నిర్దాక్షిణ్యంగా ఆ ప్రయత్నాలను అణచివేస్తున్నారు. దానితో ప్రాణశక్తి మూగబోతున్నది. నీరసించి నిస్సహాయంగా మీవైపు చూస్తున్నది. ఇక్కడ మనమొక సూక్ష్మాన్ని గమనించాలి. ప్రాణశక్తి





పని చేయగలగాలి. పనేమీ లేకపోతే ఇరవై గంటలూ అట్లా కూర్చోగలగాలి. అదీ మనం సాధించాల్సింది.

**భక్తుడు :** ఒకే టైంలో చేయడమా? లేకపోతే మార్చి మార్చి చేయడమా?

**గురువుగారు :** మార్చి మార్చి చేస్తే మంచిది. కొంతకాలం ఒక టైంలో చెయ్యాలి. ఉదయం ఆరు నుంచి ఏడు వరకు పెట్టుకున్నావనుకో, ఒక నెల రోజులపాటు ఆరు నుంచి ఏడు గంటల వరకు చెయ్యాలి. ఆ తర్వాత ఏడు నుంచి ఎనిమిదికి మార్చు. మనసుకి ఏమి అలవాటై పోతుందంటే ఆరు నుంచి ఏడు వరకు అలవాటై పోయి, ఏడు నుంచి మొదలుపెడుతుంటుంది మళ్ళా పెత్తనాలు చెయ్యడం. కాబట్టి మళ్ళీ అక్కడ కూడా ఆగాలి. అలా మొత్తం టోటల్‌గా రొటీన్ అంతా మారుతుంది. వీటన్నింటికంటే ముఖ్యమేమిటంటే... మన యాటిట్యూడ్, మన దృక్పథం. ఆచరణలో మనమెలా ఉన్నాము? ఈ ధ్యానంలో కూర్చొనేటువంటిదిగాని, జపం చేసేటప్పుడుగానీ మనకు మనఃస్థితి ఎట్లా ఉంటుందంటే, ఈ మనఃస్థితికి కారణమేమిటనంటే... ఈ గంటకు బయట మనమేం చేస్తున్నాం? బాబా భజనలో, ధ్యానంలో కూర్చోక ముందు బయట మనమేమి చేస్తున్నామో అది డిసైడ్ చేస్తుంది. వాటి గురించి మీరు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. అవి సరిగ్గా ఉంటే ధ్యానం సరిగ్గా కుదురుతుంది. బయట చేసేవన్నీ కూడా చేష్టలన్నీ చేసి, ధ్యానానికి కూర్చుంటే మాత్రం కుదరదు. కాబట్టి ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సింది బయట. మనమేం మాట్లాడుతున్నాం? ఎవరితో మాట్లాడుతున్నాం? ఎట్లా మాట్లాడుతున్నాం? ఏమేం చేస్తున్నాం?... ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. మనలో నిజాయితీ ఉందా? అబద్ధాలు చెప్తున్నామా చిన్నవాటికి, అవసరం లేని వాటికంతా కూడానూ? మనలో ఎక్కువమంది అబద్ధాలు చెప్తారు. నిజంగా అవసరమా? ఒక్కసారి ఆలోచించుకోండి మీరు. ఎక్కువ అనవసరంగా, అలవాటుగా అబద్ధాలు చెప్తాం. అబద్ధాలు చెప్పకూడదు మనం. ఇట్లా చిన్నచిన్నవే. పెద్దవేమీ కాదవి. అవి చాలా కష్టం. మీకు చిన్నవనిపిస్తాయి. అవి చేసి చూడండి, మీకే తెలుస్తుంది ఫలితం. రోజంతా లేజీగా గడుపుతున్నామా? మనకుగానీ, ప్రక్కనవాడికిగానీ పనికొచ్చే పనిచేస్తున్నామా, లేదా? పాతికేళ్ళు వస్తున్నా, ముప్పై ఏళ్ళు వస్తున్నా ఆధారపడివున్నామా? మనం కష్టపడి సంపాదించుకుని, మనమేదైనా చెయ్యడానికోసం ప్రయత్నం చేస్తున్నామా? ఒక్కసారి మీకు మీరే ఆలోచించుకుంటే మీకే తెలుస్తుంది. పట్టుండాలి దానికి. నేను చెప్తుంటే మీకు చాలా ఈజీగా ఉంది. అరగంట కూర్చోండి, తెలుస్తుంది. రెండ్రోజులు కూర్చొని మూడో రోజు వచ్చేటప్పటికి, నాకేదో



పనిబడింది, నాకు ఉద్యోగం పనిబడింది, చదువుకోవాలి... అప్పుడొస్తాయి చదువులు, అప్పుడొస్తాయి బాధ్యతలు. అయినా గురువుగారు బాధ్యతలకు అటెండ్ కావడం మానుకోమని చెప్తారా? మనం అవి అటెండ్ కావాలి, లేదంటే బాబా పని ఉంది వెళ్ళిపోదాము అని మనసు ఎన్ని ఎత్తులేస్తుందో అన్ని ఎత్తులేస్తుంది.

**భక్తుడు :** గురువుగారూ! జాబ్‌కి పోయినప్పుడు మరెలా చేయాలి?

**గురువుగారు :** ఎంతసేపు చేస్తావు? ఇరవై నాలుగు గంటలూ జాబ్ చేస్తావా? ఎనిమిది గంటలు చేస్తారా జాబ్? 8 గంటలు చేస్తారు. మరి 24లో నుంచి 8 తీసెయ్యండి. ఎంత?

**భక్తుడు :** పదహారు గంటలు.

**గురువుగారు :** పదహారు గంటల్లో ఎంతసేపు నిద్రపోతారు? ఎనిమిది గంటలు నిద్రపోతారా? ఎనిమిది గంటలు. ఎనిమిది గంటలున్నాయి కదా! పళ్ళు తోముకోవడం, లెట్రిన్‌కి పోవడం, పెత్తనాలు చేయడం... వాటికి ఒక రెండు, మూడు గంటలు తీసేయండి. ఇంకా ఎన్ని గంటలున్నాయి?

**భక్తుడు :** ఐదు గంటలు.

**గురువుగారు :** ఐదు గంటల్లో నేను అరగంట చెయ్యమంటున్నాను.

**భక్తుడు :** అంటే బాబాకు సంబంధించిన పని చేసుకొని, తర్వాత...

**గురువుగారు :** అదీ చేస్తాం, ఇదీ చేస్తాం. ఇది ఎందుకు చేయాలనంటే నేను చెప్పినటువంటిది, మనసు మీద కంట్రోల్ రావడానికి మాత్రమే. అది సాధనేమీ కాదు నేను చెప్పేటువంటిది. ఏదైనా చెయ్యగలగాలి. ఏదైనా చేసేదానికి మన మనసుకి శక్తి కావాలి. శరీరానికీ శక్తి కావాలి. చక్కగా ఏజ్‌లో ఉన్నారు. ఏవైనా ఎక్సర్‌సైజెస్ చేస్తున్నామా, ఆసనాలు వేస్తున్నామా? మీరందరూ పదిమంది ఉన్నారంటే చిన్నగా పదిమందీ కలసి ఏదైనా ఆసనాలు వేయడం, ఎక్సర్‌సైజెస్ చేయడం చక్కగా ప్రాక్టీస్ చెయ్యండి. పంతొమ్మిది, ఇరవై ఏళ్ళకే పొట్టలు పెంచుకొని తిరగకండి. నాకు హెల్త్ బాగా లేదు, నాకా జబ్బొచ్చింది, నాకీ జబ్బొచ్చింది, నడవలేను... ఈ వయసులో కాదు మీరనాల్సింది. అట్లా శరీరానికీ శక్తి ఉండాలి. శరీరానికి, మనసుకీ రెండింటికీగానీ శక్తి వస్తే నేను చెప్పినటువంటి తిని అరాయించుకునే జీర్ణశక్తి పెంపొందుతుంది.

**భక్తుడు :** సార్, మేమేం చేసినా అది బాబాకు కాంటాక్ట్ లేనిదైతే వదిలెయ్యమంటున్నారు కదా! మరి మార్నింగ్ లేచిన దగ్గర్నుంచి మనం చేసే ప్రతి పనీ బాబాకు సంబంధించినదే, బాబాకు దగ్గర





చేసే పనే అని ఆలోచించుకుంటూ చేయగలిగి ఉండాలి కదా సార్?

**గురువుగారు :** ఉండగలగాలి.

**భక్తుడు :** అంటే ఆ ఆలోచన పోకుండా...

**గురువుగారు :** మనం చేసే పనులలో, రోజూ చేసే పనులలో నిజానికి క్రొత్తగా చేసే పనులు చాలా కొద్దే ఉంటాయి. అన్నీ మామూలుగా రొటీన్‌గా చేస్తుండే పనులే చేస్తాము. మనకు దృక్పథంగానీ ఉంటే ఆటోమాటిగ్గా చేస్తాం. ప్రతి దానికీ ముందు ఆలోచించేటప్పుడు ఒక నిమిషం ఆలోచించి చెయ్యడం కాదు. అది తెలిసిపోతుంది. క్రొత్తగా డెసిషన్ తీసుకొని ఈ పని చెయ్యాలా, చెయ్యకూడదా అని ఆలోచించేటువంటి పనులు రోజులో చాలా తక్కువుంటాయి. అసలు ప్రతిరోజూ కూడా రావు. ఎప్పుడోగానీ రావు అట్లా. రోజూ రొటీనే జరిగిపోతుంటుంది, అంతే. ఆ రకంగానే లేస్తాము, ఆ రకంగానే పళ్ళు తోముకుంటాము, ఆ రకంగానే లెట్రిన్‌కి పోతాము, ఆ రకంగానే పోచుకోలు కబుర్లు చెప్తుంటాము. అవంతా రొటీన్. **(........ ఆడియోలో కొంత భాగం రికార్డ్ కాలేదు.)**

**గురువుగారు :** దేన్ని చూసి అహంకారం? దేన్ని చూసుకొని గర్వం?

**భక్తుడు :** ఉంటాయి కదా సార్!

**గురువుగారు :** ఎందుకుంటాయి? ఏం చూసుకొని నువ్వు గర్వపడుతున్నావు చెప్పు?

**భక్తుడు :** మాకు గురువుగారు ఉన్నారు, మాకు బాబా ఉన్నారు అని...

**గురువుగారు :** గర్వం కాదది. అది గర్వమంటారా? మాకు గురువుగారున్నారు అనుకోవడం గర్వమా అది? దానికి కాదు గర్వం. **గురువుగారికిష్టమైన ప్రకారంగా నేను ఉండగలుగుతున్నాననే గర్వం ఉండాలి. ఆ గర్వం ఉంటే ఉంచుకోండి, మంచిదే! ఇంక అది కాకుండా మనం గర్వించదగ్గవి ఏమున్నాయి కనుక?**

**భక్తుడు :** వాళ్ళు చూసుకుంటారు, వాళ్ళు చేస్తారని...

**గురువుగారు :** మనకు అహంకారం ఉండేదానికి అవకాశమే లేదు. మీరు ఊరికే అనుకుంటున్నారు కాబోలు. ఏం చూసుకొని అహంకారం? ఏమన్నా ఉంటే కూడా, అహంకారం ఉండదు. అది వేరే విషయం. ఇట్లా చూసుకున్నా, అట్లా చూసుకున్నా మీకు ఆ ప్రాబ్లం లేదు.

**– గురువుగారి అనుగ్రహభాషణల నుండి**

**(మిగతా తరువాయి సంచికలో)**